






నేటి దినపత్రిక

# సూర్య

ఉత్తరాంధ్ర

ఆదివారం 23-6-2024 పేజీలు 5

www.suryaa.com

విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం

విజయనగరం శ్రీకాకుళం


# వైసీపీకి జీవీఎంసీ ఝలక్..!

విశాఖ, అనకాపల్లిలో వైసీపీ కార్యాలయాలకు నోటీసులు జారీ

– విశాఖ కార్యాలయానికి అతికించిన నోటీసును చించేసిన మాజీ మంత్రి గుడివాడ

## అనుమతుల్లేని విశాఖ వైసీపీ కార్యాలయం

**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఎండాడలో అత్యంత విలాసవంతంగా నిర్మించిన వైసీపీ పార్టీ కార్యాలయానికి ఎటువంటి అనుమతులు లేనందువల్ల జీవీఎంసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రెండు ఎకరాల స్థలంలో భారీ కార్యాలయ భవనాన్ని వైసీపీ నిర్మించింది. అయితే దీనికి జీవీఎంసీ నుంచి అనుమతులు తీసుకోవలసి వుండగా బిల్డింగ్ పర్మిషను వీఎంఆర్డీఏకి దరఖాస్తు చేశారు. అది కూడా వీఎంఆర్డీఏ స్కూటినీలో వుంది. అయినప్పటికీ భారీ నిర్మాణాన్ని చేపట్టి అందులోనే పార్టీ విధులను నిర్వహిస్తున్నారు. ఇది కళ్ళ ముందు కనబడుతున్నప్పటికీ వైసీపీ ఏజెంటు కింద వ్యవహరిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ కూడా అయిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. మల్లికార్జున ఎటువంటి చర్యా తీసుకోలేదు. అయితే ఈ అక్రమ నిర్మాణానికి సంబంధించి ఏడు రోజుల్లోగా సమాధానం యివ్వాలని జీవీఎంసీ జోన్-2, టౌన్ప్లానింగ్ ఆఫీసర్ వైసీపీకి నోటీసు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా సమాధానం యివ్వకపోతే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ నోటీసులో హెచ్చరించారు.

**అతికించిన నోటీసును చించేసిన 'గుడివాడ'**

ఎండాడలో ఎటువంటి అనుమతుల్లేకుండా వైసీపీ కార్యాలయాన్ని నిర్మించడంతో.. జీవీఎంసీ యంత్రాంగం ఆ కార్యాలయానికి అతికించిన నోటీసులను శనివారం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చించేశారు.

## అనకాపల్లిలోనూ కార్యాలయం నిర్మాణం

**అనకాపల్లి, జూన్ 22, మేజర్‌న్యూస్:** అధికారం చేతిలో ఉంది కదా అని వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరించింది. పూర్తిస్థాయి అనుమతులేవీ లేకుండానే రాష్ట్రంలోని పలు చోట్ల పార్టీ కార్యాలయాల్ని నిర్మించేసింది. జీవీఎంసీ అనుమతులు కాకుండా తాను ఇంచార్జి కమిషనర్ ఉన్న వీఎంఆర్డీఏ ద్వారా అనుమతులిప్పించేసి విశాఖ కలెక్టర్ మల్లికార్జున ఘనతికెక్కారు. దీంతో శనివారం విశాఖ ఎండాడలోని వైసీపీ కార్యాలయానికి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు షోకాజ్ నోటీసులిచ్చారు. అయితే అనకాపల్లి జిల్లా కేంద్రంలోనూ నిబంధనలు ఉల్లంఘించి పార్టీ కార్యాలయాన్ని నిర్మించేశారు. దీంతో అక్కడా నోటీసులిచ్చారు. పార్టీ కార్యాలయం కోసం జీవీఎంసీ అనుమతుల్లేకుండా భారీ భవనాన్ని నిర్మించేసింది. జాతీయ రహదారి సమీపంలోని 1.75 ఎకరాల స్థలంలో 33ఏళ్లకు లీజుకు తీసుకున్నట్టు పత్రాలు సిద్ధం చేశారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం ఏడాదికి ఎకరానికి రూ.1000చెల్లించేలా స్థలం ఇప్పించే సుకున్న వైనం బయట పడింది. కూటమి ప్రభుత్వం ఈ అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి నోటీసులిప్పిస్తోంది.

**వారంలో సమాధానమివ్వాలి**

ఇదిలా ఉంటే అనకాపల్లి వైసీపీ భవన నిర్మాణాలకు సంబంధించి వారం రోజుల్లో సమాధానమివ్వాలని అధికారులు మిగతా 2లో

# కాలువలు వారం రోజుల్లో క్లీనింగ్ పూర్తి చేయాలి

-జిల్లాలో డయేరియా రాకుండా ముందస్తు చర్యలు

-జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదేశం




**శ్రీకాకుళం, జూన్ 22, మేజర్‌న్యూస్:** కాలువలు వారం రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ క్లీనింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. జిల్లాలో డయేరియా రాకుండ ముందస్తు చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. డయేరియా, మలేరియా, పారిశుధ్యం పై తహసీల్దార్లు, ఎంపిడిఓలుతో ఆయన శనివారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికిన్ గున్యా లపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏజన్సీ ప్రాంతాల్లోనూ దృష్టి సారించాలని, సంబంధిత శాఖల అధికారులు, అనుబంధ శాఖలుతో కలసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు. శానిటేషన్ సరిగా ఉంటే ఏ విధమైన వ్యాదులు ఉత్పన్నం కావన్నారు. డిపిఓ వెంకటేశ్వరావు మాట్లాడుతూ గత మూడు రోజులుగా ప్రత్యేక డ్రైవ్ లో పారిశుధ్య పనులు ప్రారంభించి పనులు జరుగుతున్నాయని, కాలువలు క్లియర్ చేయాలని, రోడ్ల పై చెత్త లేకుండా మిగతా 2లో

పోలీసు స్కూలు విద్యార్థులకు

# అందుబాటులో 'శారద కళా వేదిక'

## విజయనగరం జిల్లా ఎస్పీ ఎం.దీపిక

**విజయనగరం క్రైమ్, జూన్ 22, మేజర్‌న్యూస్:** విజయనగరం పట్టణం కంటోన్మెంట్ లోని పోలీసు సంక్షేమ పాఠశాలలో శారద మెటల్స్ మరియు అల్లాయిస్ కంపెనీ వారి సౌజన్యంతో నూతనంగా నిర్మించిన "శారద కళా వేదిక"ను జిల్లా ఎస్పీ ఎం.దీపిక, ఐపిఎస్ జూన్ 22న ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం. దీపిక మాట్లాడుతూ పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాల క్రమంగా వృద్ధి చెందుతుందని, ఇప్పటికే అనేక సౌకర్యాలతో కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా, ఉన్నత విద్యను, క్రమశిక్షణను తక్కువ ఫీజులతో అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొత్తవలసకు చెందిన శారద మెటల్స్ అండ్ అల్లాయిస్ కంపెనీవారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, పోలీసు సంక్షేమ పాఠశాలలో కళా వేదికను నిర్మించేందుకు ముందుకు వచ్చి, నిర్మాణం పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఇకపై పాఠశాలలో ఏ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా, క్రీడా పోటీలు జరిగినా, బహుమతి ప్రధానోత్సవం జరిగినా "శారద కళా వేదిక" చక్కగా వినియోగపడనున్నదని జిల్లా ఎస్పీఎం.దీపిక మిగతా 2లో



# ఉత్తరాంధ్రలో కలెక్టర్ల బదిలీ

## జీఏడీకి విశాఖ కలెక్టర్



**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలువురు కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయన స్థానంలో విశాఖ జేసీ మయూర్ అశోక్ కలెక్టర్ (ఎఫ్ఏసీ)గా వ్యవహరించనున్నారు.

- విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మిని గుంటూరు కలెక్టర్‌గా నియమించారు.
- విశాఖ కలెక్టర్ మల్లికార్జునను జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశాలు, జాయింట్ కలెక్టర్‌కు ఎఫ్ఏసీగా అవకాశం
- అల్లూరి కలెక్టర్ ఎం.విజయ సునీతను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశం
- మధ్యాహ్న భోజన పథక డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను విజయనగరం జిల్లా కలెక్టర్‌గా నియమించారు.
- శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ ఎ.తమీవమ్ అన్సారీయాను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా వేశారు.

# గ్రామాలన్నింటినీ కూడా ప్రజలు చూస్తున్నారు..?

**పలాస/మందస, జూన్ 22, మేజర్‌న్యూస్:** రాజకీయాల్లో గెలుపు ఉంటుంది, ఓటమి ఉంటుంది. కాని ఇంతటి బరితెగింపు ప్రభుత్వాన్ని ఎక్కడా చూడలేదని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవ ర్గం పలాసలో శనివారం ప్రగతి భవనంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షం అనేది ఉండకూడదని, ఆపార్టీ నాయకుల్ని ఉంచకూడదని, ఆ పార్టీకి చెందిన భవనాలను కూలగొట్టాలనే దుర్మార్గపు నిర్ణయాలతో ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన దగ్గర నుంచి పరిశీలిస్తే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోకూడా జరిగిన హింసాకాండ కూడా ఈ ప్రభుత్వ ఉద్దేశాలను చెప్పకనే చెప్తున్నాయన్నారు. హత్యలు దగ్గరనుంచి అమానుషంగా దాడులు చేయడం, ఆస్తులకు నష్టంచేయడం, అంతేకాక సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్ లాంటి వాటికీ నష్టంచేకూర్చడం చేస్తూనే ఉన్నారన్నారు. చివరకు మా



పార్టీకార్యాలయాలను కూడా ధ్వంసం చేస్తున్నారన్నారు. చట్టాన్ని అనుసరించాలని హైకోర్టు ఆదేశించినా సరే దాన్ని మీరి వెంటనే బుల్డోజర్లను పంపించి విధ్వంసానికి దిగారన్నారు. రాష్ట్రంలో అసలు రాజ్యాంగం ఉందా? లేదా? చట్టం పనిచేస్తుందా? లేదా? వ్యవస్థలు ఉన్నాయా? లేవా? అన్న సందేహాలు ప్రతి ఒక్కరిలోనూ కనిపిస్తున్నాయన్నారు. ఆటవిక రాజ్యాలు, నియంతలు, మానవత్వంలేని నాయకుల గురించి చరిత్రలో చదువుకున్నాం. ఇప్పుడు చంద్రబాబు పాలనద్వారా కళ్లారా చూస్తున్నామన్నారు. ప్రమాణస్వీకారం చేసి 10 రోజులు కాకముందే రాష్ట్రంలో సృష్టించిన ఈ భయానక పరిస్థితుల ద్వారా రాబోయే ఐదేళ్లుకూడా రాష్ట్రంలో ఎలాంటి పాలనకొనసాగుతుందనే విషయాన్ని చాలా స్పష్టంగా చెప్తున్నారన్నారు. ప్రెస్‌మీట్లు చూసినా, వారి మాటలు చూసినా.. తేనెపూసిన మాటలు మాట్లాడుతున్నారు. మరోవైపు కత్తులతో ప్రత్యర్థి రాజకీయపార్టీ గొంతు కోయాలని మిగతా 2లో

# ఎట్టకేలకు మల్లికార్జున ఔట్

విశాఖపట్నం, న్యూస్‌లీడర్, జూన్ 22: వైసీపీ కార్యకర్తగా వ్యవహరించి, అనేక అక్రమాలు, అవినీతికి పాల్పడిన విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు ఎట్టకేలకు బదిలీ అయ్యింది. ప్రభుత్వం మల్లికార్జునకు ఎటువంటి పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కి పంపించింది. ప్రస్తుత జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. గత మూడేళ్లగా విశాఖలోనే తిష్ట వేసుకుని కూర్చున్న మల్లికార్జునపై అనేక భూ కుంభకోణాలకు సంబంధించిన ఆరోపణలున్నాయి. కలెక్టర్‌గా, వీఎంఆర్డీఏ కమిషనర్‌గా జోడు పదవులతో అనేక అవినీతి వ్యవహారాలకు మల్లికార్జున కేంద్ర బిందువుగా ఉండి గతంలో మరే కలెక్టర్‌కూ లేనంతగా చెడ్డ పేరును మూటగట్టుకున్నారు. గత సీఎం జగన్ అండ చూసుకొని మల్లికార్జున అనేక దుర్మార్గాలకు పాల్పడ్డారు. మల్లికార్జున పని చేసిన కాలంలో చేసిన వివిధ పనులపై విచారణ జరిపించాలని చాలా కాలంగా దళిత నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెడతాం

-ఫిల్మ్ నగర్ సొసైటి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కమిటీలు తక్షణమే తప్పుకోవాలి

-భీమిలి ఎమ్మెల్యే గంటా అల్టిమేటం



**భీమునిపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** వైసీపీ ప్రభుత్వం సర్వ నాశనం చేసిన వ్యవస్థల ను గాడిలో పెడతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సొసైటి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ లలో తిష్ఠ వేసిన కమిటీలు జనరల్ బాడి సమావేశాలు ఏర్పాటు చేసుకుని స్వచ్ఛందంగా తప్పుకోవాలని ఆయన సూచించారు. ఇలాంటి ఏకపక్ష కమిటీల విషయంలో ప్రభుత్వం సీరియస్ గా ఉందన్నారు. మొండికేసిన వారిపై చర్యలు తీసుకురావడానికి అనేక మార్గాలున్నాయని, దానికి సంబంధించిన విచక్షణాధికారాలు ప్రభుత్వానికి ఉంటాయని తెలిపారు. తిమ్మాపురంలోని ఫిల్మ్ నగర్ కల్చరల్ సొసైటిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీ నిర్మాతలు కె.ఎస్.రామారావు, అశోక్ కుమార్ లతో కలిసి మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మొదటి అడుగుగా ఫిల్మ్ నగర్ సొసైటి కోసం ప్రభుత్వ భూమిని ఇచ్చామన్నారు. వంద కోట్ల రూపాయలతో సినీ కళాకారుల శిక్షణ కేంద్రం, డ్రామా థియేటర్ వంటి వసతులు కల్పించి విశాఖలో పరిశ్రమ అభివృద్ధి చేయడానికి సొసైటి బాధ్యులు ముందుకు వచ్చారని వెల్లడించారు. మొదట తొట్లకొండపై 15 ఎకరాల కేటాయించామని, బుద్ధిస్ట మిగతా 2లో

# నగరంలో అతిసారవ్యాధి వ్యాపించకుండా జాగ్రత్తలు చేపట్టండి

## జీవీఎంసీ కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ






**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** నగర పరిధిలో అతిసారవ్యాధి ప్రబలకుండా పటిష్టమైన జాగ్రత్తలతో కూడిన చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ జివిఎంసి అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చేపట్టిన "స్టాప్ డయేరియా" ప్రచార కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో అతిసార వ్యాధి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు నియంత్రణా చర్యలపై ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జివిఎంసి అదనపు కమిషనర్ (డెవలప్మెంట్) కె.ఎస్.విశ్వనాధన్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అతిసారవ్యాధితో పాటు మలేరియా, డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధులు నగరంలో ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా డిసిల్టింగ్ ఆఫ్ డ్రైన్స్ కార్యక్రమం ముమ్మరంగా చేపట్టాలని, నగరంలో 1019 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన గెడ్డల్లోని పూడికలు తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను, అలాగే 2890 కిలోమీటర్ల మేర ఉన్న చిన్న కాలువలలో పూడికలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ప్రజా ఆరోగ్య విభాగ అధికారులను కమీషనర్ ఆదేశించారు. జోనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాల సమన్వయంతో నగర పరిధిలో ఉన్న బి.ఆర్.టి.ఎస్. కారిడార్లలో, హైవే రోడ్లపై, బీచ్ రోడ్డులలో వర్షపు నీరు నిల్వ ఉండబోయే ప్రాంతాలను గుర్తించి వాటిని తొలగించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి సరఫరా విభాగం, పబ్లిక్ వర్క్స్ విభాగం సహాయక ఇంజనీర్లు మిగతా 2లో

# దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెడతాం

(మొదటి పేజీ తరువాయి)

సంఘాల నుంచి వ్యతిరేకత రావడంతో రామానాయుడు స్టూడియో దగ్గర 5 ఎకరాల ఇచ్చామని వివరించారు. ఈ భూమి కోసం సొసైటి ప్రభుత్వానికి రూ.22 లక్షలు చెల్లించిందని చెప్పారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రధానమైన సినీ పరిశ్రమ అభివృద్ధి అంశాన్ని పక్కన పెట్టేసి, ఫిల్మ్ నగర్ సొసైటిని రాజకీయ జోక్యంతో అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. నిర్ణీత రుసుం చెల్లించని తమ వారికి కూడా సభ్యత్వాలు ఇచ్చుకున్నారని ఆరోపణలు ఉన్నారన్నారు.

**ఫిల్మ్ నగర్ సొసైటి శాశ్వత కమిటీ నియమావళి ప్రపంచ వింత**

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా శాశ్వత కమిటీ ఏర్పాటు చేసుకుని, తమ తదనంతరం తమ వారసులే ఆ శాశ్వత కమిటీలో ఉండేలా సొంత నియమావళి రాసుకున్నారని గంటా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 లో 1,154 మంది సభ్యులతో ఉన్న సొసైటి సభ్యుల సంఖ్య 1,630 కి చేరిందన్నారు. నిబంధనలను తుంగలోకి తొక్కి ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న కాయల వెంకటరెడ్డి, ఇతర వైసీపీ నాయకులు తమ డ్రైవర్లు, వాచ్ మెన్లు, వారి ఆఫీసుల్లో పని చేసే సిబ్బందికి సభ్యత్వాలు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఎస్.ఆర్. గోపీనాథ్ రెడ్డి, ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి లాంటి వారిని కోర్ కమిటీల్లో సభ్యులుగా తీసుకున్నారని చెప్పారు. సొసైటి ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయకుండా భయపెట్టి ఏకగ్రీవం చేసుకున్నారన్నారు. 2019 నాటికే సొసైటికి రూ.32 కోట్ల నిధులున్నాయని, నిధులు దుర్వినియోగం ఆరోపణలపై విచారణ చేయిస్తామన్నారు. సినిమా ఇండస్ట్రీకి ఏమాత్రం సంబంధం లేని వైఎస్సార్ పేరును ఫిల్మ్ నగర్ సొసైటీలోని లాన్స్ కు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధి చేయాలన్న ఫిల్మ్ నగర్ సొసైటి లక్ష్యానికి అనుగుణంగా పని చేసే కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని సూచించారు.

**ఇంచార్జీల పేరుతో వాటాలు**

వైసీపీ ఇంచార్జీల పేరుతో విశాఖ వచ్చిన వైసీపీ నేతలు ఈ ప్రాంతాన్ని దోపిడీ చేశారని, అన్ని వర్గాలను భయ భ్రాంతులకు గురి చేశారన్నారు. రాడిసన్ బ్లూ హెూటల్‌లో 50 శాతం వాటా రాయించుకున్నారని, బే పార్కులోనూ బలవంతంగా వాటా తీసుకున్నారని గంటా తెలిపారు.

ప్రభుత్వంలో ఉన్న ముఖ్య నాయకులు ఇతరుల వ్యాపారాల్లో చొరబడి వాటిని హస్తగతం చేసుకోవడం ఎప్పుడూ వినలేదన్నారు. అనుమతులు లేని పనుల విషయంలో శాఖాపరమైన చర్యలు సర్వ సాధారణమని చెప్పారు. అనుమతులు ఉంటే వైసీపీ కార్యాలయాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. వైసీపీ ప్రభుత్వంలా కక్ష సాధింపు వ్యవహారాలకు తమ ప్రభుత్వం దూరంగా ఉంటుందని స్పష్టం చేశారు.

# కాలువలు వారం రోజుల్లో క్లీనింగ్ పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చూడాలన్నారు. ప్రతీ 15 రోజులకు ఒక సారి క్లీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. నీళ్ల ట్యాంకులు క్లీన్ చేసి క్లోరినేషన్ చేయాలని చెప్పారు. వారం రోజుల్లో కాలువలు ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి ట్యాంకులు బ్లీచింగ్, క్లోరినేషన్ సరిగా చేస్తున్నది లేనిది ఈఓఆర్డీలు చూడాలని ఆదేశించారు. ఫాగింగ్ మిషన్ లు ఎన్ని ఉన్నాయో అన్నిటిని అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. నీరు నిల్వ ఉంటే ఆ నీరు తొలగించి ఆ ఫోటో అప్లోడ్ చేయాలన్నారు. చెత్త సేకరణ పక్కాగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. శానిటేషన్ నిరంతర ప్రక్రియని గుర్తు చేశారు. ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ జిజె బెన్హర్ మాట్లాడుతూ ప్రతీ నీటి ట్యాంకు క్లోరినేషన్ చేయాలని చెప్పారు. క్లోరినేషన్ పై ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన పరచాలని తెలిపారు. ప్రతీ ట్యాంకు పై ఎప్పుడు క్లీన్ చేశారు తిరిగి ఎప్పుడు క్లీన్ చేయాలో తేదీలు డిసిప్లే చేయాలని, రిజిష్టర్లు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ మూడు నెలలు చాలా జాగ్రత్తగా ఉంటే ఏ విధమైన వ్యాదులు రాకుండా అరికట్టవచ్చున్నారు. మేన్ హెూల్స్ ఓపెన్ లేకుండా చూడాలని, పైపు లైన్ లీకేజీ లేకుండా చూడాలన్నారు. వాల్ పిట్స్ డ్రైగా ఉండే విధంగా చూడాలని చెప్పారు. బ్లాక్ స్పాట్స్ గుర్తింపు తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వద్ద టెస్టింగ్ కిట్లు ఉంటాయని, ప్రతీ రోజు రెండు శాంపిల్స్ పరీక్షించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఇవన్నీ జరిగితే డయేరియా వంటివి రాకుండా ఉంటాయన్నారు. రావడానికి ముందుగానే జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి మాట్లాడుతూ తాగునీరు శుభ్రమైనవి త్రాగడం, చేతులు కడుగుకోవడం వంటి వాటిపై ప్రజల్లో అవగాహన పరుస్తామన్నారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు ఏర్పాటు చేసుకోవాలని పిహెచ్ సీ వైద్యులను ఆదేశించారు. ఎక్కడైనా డయేరియా వస్తే వెంటనే అక్కడకు రాపిడ్ రెస్పాన్స్ టీంలు చేరుకొని చర్యలు చేపట్టాలని తెలిపారు. నీరు కలుషితం కాకుండా జాగ్రత్తగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. బయలాజికల్ శ్యాంపిల్స్ తీసుకొని పరీక్ష చేయాలని, క్లోరినేషన్ చేసి, మళ్లీ క్లోరినేషన్ చేయాలని చెప్పారు. త్రాగడానికి ఉపయోగపడేంత వరకు పరీక్షలు చేయాలని వివరించారు. ఏదైనా సమాచారం జిల్లా కేంద్రానికి చేరాలని కలెక్టర్ ఆదేశించారు. బయలాజికల్ కంటామినేషన్ జరిగితే వెంటనే ఆ నీరు త్రాగకుండా నిలుపుదల చేయాలన్నారు. డయేరియా చాలా ప్రమాదమని చెప్పారు. అంతా అప్రమత్తంగా ఉండాలి ఆదేశించారు. శుద్ధ జలాలు అందిస్తే ఏ సమస్య ఉండదన్నారు. ఈ మూడు నెలలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి పరిశీలించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. డియంహెచ్ఓ మాట్లాడుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు నిల్వ ఉంచుకోవాలని, పిల్లలకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని, జింక్ ట్యాబ్ లెట్లు ఇవ్వాలని చెప్పారు. ప్రతి ఇంటింటికి వెళ్ళి అవగాహన పరచాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వాసుదేవరరావు మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయాలలో డయేరియా పై తీసుకుంటున్న చర్యలు పై వివరించారు. స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతి శ్రీ మాట్లాడుతూ డయేరియాపై అవగాహన కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. డిఈఓ వెంకటేశ్వరరావు డయేరియా పై చేపట్టబోయే చర్యలు పై వివరించారు. తాగునీటిని ఇంజనీరింగ్ అసిస్టెంట్లుతో పరీక్షలు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. తల్లిదండ్రులుతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన చేస్తామని డిఈఓ చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా పరిషత్ సిఈఓ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ జిజె బెన్హర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. మీనాక్షి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి బి. శాంతి శ్రీ, డిఈఓ వెంకటేశ్వరరావు, డిఐపిఆర్ఓ చెన్నకేశవరావు, డిఎంఓ సత్యనారాయణ, జిల్లా ప్రోగ్రాం అధికారి వెంకటరత్నం, తదితరులు పాల్గొనగా మండలాల నుండి తహసీల్దార్లు, ఎంపిడిఓలు, వైద్యాధికారులు, తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# నగరంలో అతిసారవ్యాధి వ్యాపించకుండా జాగ్రత్తలు చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

వారి పరిధిలోని గల మురుగు నీటి కాలువలు, కల్వర్టులు గుండా వెళ్ళే తాగునీటి పైపులను మూడు రోజుల్లో గుర్తించి వాటి లీకులను అరికట్టే చర్యలను చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీర్లను కమీషనర్ ఆదేశించారు. జోన్ వారీగా వున్న 246 ఇ.ఎల్.ఎస్.ఆర్., జి.ఎల్.ఎస్.ఆర్. నీటి ట్యాంకులను, పరిశుభ్ర పరచాలని, నీటి నాణ్యత పరీక్షలు చేపట్టాలని, సచివాలయ వాలంటీర్ల ద్వారా కాలనీలకు వెళ్ళే నీటి సరఫరా లో క్లోరిన్ టెస్ట్ నిర్వహించే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే 682 కిలోమీటర్ గల ప్రధాన రోడ్లలో, అంతర్భాగ రోడ్లలో భూగర్భ డ్రైనేజిల యందు సిల్ట్ లను తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గార్బేజ్ వల్నరబుల్ ప్రదేశాలను గుర్తించి వ్యర్థాలు లేకుండా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని, ప్రజా మరియు సామాజిక మరుగుదొడ్లలో డ్రైనేజీ, నీటి సరఫరా, పరిశుభ్రత మొదలైన మౌలిక వసతులను పరిశీలించి నివేదిక సమర్పించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ ను ఆదేశించారు. చిన్నపిల్లలలో అతిసార వ్యాధి సోకే అవకాశం ఉన్నందున సచివాలయాల పరిధిలో వాలంటీర్ల ద్వారా ఐదు సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి నివేదిక సమర్పించాలని డిపిఒ ఎం.వి.డి. ఫణిరాంను కమీషనర్ ఆదేశించారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని, ప్రతి వారం తప్పని సరిగా కాలువలలో స్ప్రేయింగ్, వీధులలో, కాలనీలలో ఫాగింగ్, చెరువులలో గంబుషియా చేపల విడుదల, తదితర కార్యక్రమాలు చేపట్టాలని, ప్రతి ఇంటా దోమలు వృద్ధి చెందే ప్రదేశాలు గుర్తించి, వారంలో ఒక రోజు విధిగా "డ్రై డే" పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్.ఎస్.వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజనీర్ రవి కృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, జోనల్ కమిషనర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, యుసిడి ప్రాజెక్టు ఆఫీసర్, డిపిఓలు, బయాలజీస్టు, ఏఎంఒహెచ్ లు, ఏపీడీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పోలీసు స్కూలు విద్యార్థులకు అందుబాటులో 'శారద కళా వేదిక'

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. శారద మెటల్స్ అండ్ అల్లాయిస్ కంపెనీ సీనియర్ జి.ఎం. ప్రభాత్ మోహన్ మాట్లాడుతూ తమ కంపెనీ తరుపున సేవా కార్యక్రమాలు చేపట్టే క్రమంలో ఎక్కువగా విద్యార్థుల భవిష్యత్తునే దృష్టిలో పెట్టుకుంటామన్నారు. ఇందులో భాగంగా ఈసారి పోలీసు సంక్షేమ పాఠశాలను ఎంపిక చేసుకొని, కళా వేదిక నిర్మాణ చేపట్టామన్నారు. అనంతరం, కంపెనీ యాజమాన్యం పాఠశాల విద్యార్థులకు పెన్సిల్స్, కేకులను జిల్లా ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం. సోల్మన్, ఏఆర్ డిఎస్పీ యూనివర్స్, శారద మెటల్స్ అండ్ అల్లాయిస్ కంపెనీకి చెందిన సీనియర్ జి.ఎం. (హెచ్ఆర్) ప్రభాత్ మోహన్, సీనియర్ జి.ఎం. (సివిల్) విజయ భాస్కర్, డిజిఎం (హెచ్ఆర్) హెచ్. సన్యాసిరావు, ఎస్బీ సిఐ కే.కే.వి.విజయనాధ్, ఆర్ఐలు ఎన్. గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, భగవాన్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ వర ప్రసాద్, ఎస్సై అశోక్ కుమార్ పాఠశాల ప్రిన్సిపాల్ పి.సంధ్య, పలువురు ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసీపీకి జీవీఎంసీ ఝలక్..!

(మొదటి పేజీ తరువాయి)

నోటీసులిచ్చారు. అనకాపల్లి మండలం రాజుపాలెంలో సర్వే నంబర్ 75/3లో ప్లాన్ అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టారంటూ వచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించారు. ప్లాన్ అప్రూవల్ కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసినప్పటికీ, అది పెండింగ్ లో ఉందని, జీవీఎంసీ జోన్-7 అసిస్టెంట్ సిటీ ప్లానర్ పేర్కొన్నారు. 7 రోజుల్లో సమాధానం ఇవ్వకుంటే తదుపరి చర్యలుంటాయని కూడా జీవీఎంసీ హెచ్చరించింది.

## మతిస్థిమితం లేని మహిళ వివేకానంద సంస్థకు



**విశాఖపట్నం, జూన్ 22, మేజర్ న్యూస్:** మతిస్థిమితం లేని అనుపమ అనే, 25 సంవత్సరాల మహిళ అస్సాం నుంచి, మతిస్థిమితం లేని మహిళను విశాఖపట్నం వన్ టౌన్ నందు ఉన్న అనాధాశ్రమంకు కొంతమంది తీసుకువచ్చి అప్పచెప్పారు. వచ్చింది. ఎవరికైనా ఈమె తెలిసినచో, లేక ఈమె వివరాలు ఎవరికైనా తెలిసిన, వన్ టౌన్ నందు ఉన్న వివేకనంద ఆశ్రమానికి గాని, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు గాని వివరాలు తెలియ చేయవలసిందిగా కోరుతున్నాం 8297568913.

## పూర్ణిమ సందర్భంగా జగన్నాథునికి సుగంధ జలాభిషేకం



**పాతపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** పాతపట్నం లో కొలువైన శ్రీ జగన్నాధ స్వామి ఆలయంలో దేవ స్నానం, జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించు కుని ఈరోజు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జగన్నాధుని స్నాన వేడుక ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో స్నాన వేదికపై స్వామి వారిని ఆశీనులు చేసి, ప్రత్యేక పూజలు, మంగళ హారతులు సమర్పించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పవిత్ర గంగా జలాలతో జలాభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలతో అర్చకులు స్వామిని అలంకరించి హారతులు ఇచ్చారు. స్నాన యాత్రలో పాల్గొనే స్వామి అస్వస్థతకు గురై.. 15 రోజులు పాటు విశ్రాంతి నిమిత్తం చీకటి గదిలో ఉంచుతారు. మళ్లీ వచ్చే నెల 7న రథయాత్ర పర్వదినాన భక్తులకు స్వామి వారు రథంపై దర్శనమిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో జగన్నాధుని స్నాన వేడుకలో పాల్గొన్నారు. జై జగన్నాద్ నామ స్మరణ చేస్తూ.. కనులారా కలియుగ వైకుంఠనాధుని తిలకించి భక్తులు పరవశించి పోయారు.

## విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేసిన చేయూత సంస్థ కార్యదర్శి



**లక్కవరపుకోట, జూన్ 22, మేజర్‌న్యూస్:** మండలం లోని ఎల్ కోట తలారీ గ్రామ కేంద్రముగా పని చేస్తున్న చేయూత స్వచ్చంద సేవా సంస్థ కార్యదర్శి కొట్యాడ హై స్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అయిన గుమ్మడి శ్రీనివాసరావు శనివారం చేయూత గంధాలయం లో విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేశారు అలాగే విద్యార్థులు అందరూ కల్సి డి ఎస్ సి కి ప్రిపేర్ అవుతున్న పేద విద్యార్థినికి డి ఎస్ సి కి పనికి వచ్చే పుస్తకాలు కొనగా వాటిని కూడా గుమ్మడి శ్రీనివాసరావు విద్యార్థులతో కలిసి అందజేసి ఆల్‌ది బెస్ట్ చెప్పారు.



చంద్రబాబు నాయుడు ని కలిసిన గండి బాబ్జి శనివారం అమరావతిలో తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి మర్యాదపూర్వకంగా కలిశారు ముందుగా పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు (విశాఖపట్నం - మేజర్‌న్యూస్)

## ఎమ్మెల్యే బేబినాయన పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం



**బొబ్బి, జూన్ 22, మేజర్‌న్యూస్:** బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన పుట్టినరోజు సందర్భంగా అవేర్ ఫౌండేషన్ మరియు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు బొబ్బిలి కోట దర్బార్ మహల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పువ్వల శ్రీనివాసరావు, గెంబలి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు.

## సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున



విశాఖపట్టణం, జూన్ 22 : విపత్తుల నిర్వహణలో అద్భుత కృషి చేసిన, ఉత్తమ సేవలందించిన సంస్థలకు, వ్యక్తులకు 2025 సంవత్సరానికి గాను అందజేయు సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారాల నిమిత్తం ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులను సుభాష్ చంద్రబోస్ జయంతి రోజున ప్రకటిస్తారని పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అవార్డులను ప్రతి సంవత్సరం జనవరి 23న ఒక సంస్థకు లేదా ఒక వ్యక్తికి వరుసగా రూ. 51 లక్షలు/5 లక్షల నగదు పురస్కారాలను అందజేస్తారని వివరించారు. జూలై 01, 2024 నుంచి ఆగస్టు 31, 2024 వరకు https://awards.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్ విధానంలో దరఖాస్తులను సమర్పించవచ్చని సూచించారు. జూలై ఒకటో తేదీ నుంచి సంబంధిత సైట్ ఓపెన్ అవుతుందని, అర్హులైన వారు దరఖాస్తులను సమర్పించుకోవాలని సూచించారు.

## మాదక ద్రవ్యాలపై పోలీసులు అవగాహన సదస్సు

### -ద్వారకా జోన్ ఏసిపి రాంబాబు-సిఐ గోవిందరావు



**ఆరిలోవ, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరిలోవ సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో శనివారం తోట గరువు ఎర్ని దుర్గామాంబ ఆలయ వెనుక ఉన్న కళావేదికలో ఆరిలోవ పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ద్వారకా జోన్ ఏసిపి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై అందరికీ అవగాహన కల్పించాలని గ్రామ సంఘ సభ్యులకు వివరించారు. ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు గురించి వివరిం చారు. ఆరిలోవలో డ్రగ్స్ అరికట్టేందుకు మీరందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ద్వారకా జోన్ ఏసిపి రాంబాబు, ఆరిలోవ సీఐ గోవిందరావు, రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు , 10 వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, స్థానిక టిడిపి నాయకులు బుడుమూరి గోవింద్, ఒమ్మి పోలరావు, గాడి సత్యం, ఆరిలోవ ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

# ద్రామాలన్నింటినీ కూడా ప్రజలు చూస్తున్నారు..?

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారు. ఈ డ్రామాలన్నింటినీ కూడా ప్రజలు చూస్తూనే ఉన్నారని వివరించారు. పైగా స్పీకర్ స్థానంలో అయ్యన్నపాత్రుడ్ని పెట్టారని, వాళ్లకు మెజార్టీ ఉంది ఎవరినైనా పెట్టుకోవచ్చు. కాని, ఎటువంటి వ్యక్తిని పెడుతున్నామనే కనీస ఆలోచనను చేయలేక పోయారన్నారు.

## ఇసుకకొండ స్వామి వారిని దర్శించుకున్న గంటా



**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** కె.జి.హెచ్. సమీపంలోని ఇసుకకొండ రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వారిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం దర్శించుకున్నారు. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా ధ్వజస్థంభాన్ని తాకి పంచ ప్రదక్షిణలు చేశారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### జగన్నాథస్వామి ఆలయంలో

## వైభవంగా జ్యేష్ఠాభిషేకం



**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** టౌన్ కొత్త రోడ్లో వేంచేసియున్న శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానంలో శనివారం శ్రీ జగన్నాథ స్వామికి జ్యేష్ఠాభిషేకంను ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠాభిషేకం అనంతరం రెండు వారాల పాటు స్వామి వారిని ఉక్కలో పెట్టి మళ్లీ వచ్చే నెల 6వ తేదీన నేత్రోత్సవం కార్యక్రమంతో స్వామి వారి దర్శనాలు మొదలవుతాయి.వచ్చే నెల 7న తొలి రథయాత్ర జరుగుతుంది. 8నుండి టర్నర్ సత్రం కళ్యాణమండపంలో దశావతారాలు ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్ రెడ్డి, అర్చకులు జగన్నాథాచార్యులు, సురేష్ ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల రక్షణకై నిరంతర పోరాటం- సిఐటియు



**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** కార్మిక హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాటం చేయాలని సిఐటియు జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం జగ్గ నాయుడు పేర్కొన్నారు. ఈరోజు స్టీల్ ప్లాంట్ యూనియన్ ఆఫీసులో ప్రారంభమైన కార్మికుల రెండు రోజుల శిక్షణ తరగతులు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత స్పీడ్ గా కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్స్ ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తుందని, ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేస్తుందని, అందులో భాగంగానే స్టీల్ ప్లాంట్ కు సొంత గనుల కేటాయించకుండా ప్రైవేట్ పరం చేసేందుకు పూనుకుంటుందన్నారు. స్టీల్ ప్లాంట్ కు ఆర్థికంగా ఆదుకోవాల్సింది పోయి స్టీల్ ప్లాంట్ ఆస్తులను అమ్మకానికి పెట్టడం దుర్మార్గమన్నారు. నేషనల్ మానిటైజేషన్ ఆఫ్ పైప్ లైన్ పేరుతో ప్రభుత్వ రంగ ఆస్తులను ప్రైవేటుపరం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇప్పటికే గంగవరం పోర్టు అదానీ పరమైందని, ఇప్పుడు స్టీల్ ప్లాంట్ ను కూడా అదానీ కు కట్టబెట్టాలని ప్రయత్నిస్తుందన్నారు. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో ఏర్పడిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకుని వచ్చి రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలన్నారు. రాజధాని,పోలవరంప్రాజెక్ట్ నిర్మాణం కోసం, విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక సహకారం అందించాలని ఒత్తిడి తేవాలన్నారు. విశాఖ ఉక్కుని ప్రైవేటుపరం కాకుండా బిజెపి ప్రభుత్వంతో ప్రకటన చేయించాలన్నారు. ఈ రెండు రోజుల శిక్షణా తరగతులకు సిఐటియు జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు ప్రిన్సిపల్ గాను స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్ గాను వ్యవహరించారు. ఈ శిక్షణా తరగతులకు ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్ ప్లాంట్, బిహెచ్ఇఎల్, హెచ్ఎస్ఎల్, హెచ్పిసిఎల్, పోర్ట్ ట్రస్ట్, మున్సిపల్ రంగాలతోపాటు స్కీం వర్కర్స్ అయిన ఆశ, అంగనవాడి, మధ్యాహ్నం భోజనం పథకం, ముఠా, బిల్డింగ్,ట్రాన్స్ పోర్ట్, హాస్పిటల్స్ తదితర రంగాల నుండి సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్ వి కుమార్, కార్యదర్శులు జగన్ అప్పలరాజు, పి.మణి, వెంకట రెడ్డి, కుమార్ మంగళం, శ్రీనివాసరాజు, నమ్మి రమణ, సుబ్బారావు, అప్పారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ సహకార బ్యాంక్ వ్యాపార లక్ష్యం 8 వేల కోట్లు

### :చైర్మన్ రాఘ వేంద్ర రావు




**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం సహకార బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో వ్యాపార లక్ష్యం రూ.8 వేలు కొట్లుగా నిర్ణయించా మని చైర్మన్ చలసాని రాఘవేంద్ర రావు వెల్లడించారు ఆయన ద్వారకా నగర్ ఐదో లైనులో గల బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశం లో మాట్లాడారు తమ బ్యాంక్ 1916 లో ప్రారంభించి గత 109 ఏళ్లుగా కార్యకలాపాలు నిర్వ హిస్తున్నామని గుర్తు చేశారు ఏపిలో 47,హైదరాబాద్ లో నాలుగు బ్రాంచీలు కలిగి వున్నాము అన్నారు. దేశంలోని నాన్ షెడ్యూల్డ్ సహకార బ్యాంక్ లలో అతి పెద్ద బ్యాంక్ విశాఖ బ్యాంక్ ని పేర్కొన్నారు దేశంలో 1502 పట్టణ సహకార బ్యాంకులు వున్నాయిని గుర్తుచేశారు బ్యాంక్ సభ్యులకు రూ.లక్ష వరకు ఉచిత జీవిత బీమా వుందన్నారు రుణ గ్రహీతలకు 4 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు గత ఆర్థిక సంవత్సరం లో 2596 మందికి 5.51 కోట్ల మేరకు సంక్షేమ పథకాలు అందజేశాం అన్నారు ఈ ఏడాది కొత్తగా ఐదు బ్రాంచీలు ఏర్పాటులో భాగంగా ఈనెల 20 న శీలా నగర్ లో 51 బ్రాంచ్ ఏర్పాటు చేశామని తెలిపారు ఈ ఆర్థిక సంవ త్సరం చివరి నాటికి షెడ్యూల్డ్ హెూదా వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు ఇంటి నిర్మాణం, రిపేర్లు,వాహన కొనుగోలు, వివాహాలు,చదువుకు,చిన్న తరహా పరిశ్రమలు,వ్యాపారం నిమిత్తం రుణాలు ఇస్తున్నామన్నారు డైలీ డిపాజిట్ పథకం కూడా అమలులో వుందన్నారు ఏడాది కాలంలో కోటికి పైగా డిజిటల్ కార్య కలాపాలు ద్వారా రూ.5714 కోట్లు టర్నోవర్ జరిగిందన్నారు మొత్తం 50 బ్రాంచేలలో మహా జన సభలు జరిగాయి గత ఏడాది 87.79 కోట్ల లాభం సాధించాం,డిపాజిట్లు 4148 కోట్లు,3199 కోట్లు మేరకు రుణాలు ఇచ్చాం షేరు దనం 352 కోట్లుగా ఉంది తమ బ్యాంక్ లో సభ్యులు 104865 మంది వున్నారు గత ఏడాది టర్నోవర్ 7347.54 కోట్లు అని తెలిపారు 24.70 కోట్లు ఆదాయ పన్ను చెల్లించాం ఆర్బీఐ నిబంధనలు కొన్ని ఇబ్బందిగా ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో సీఈఓ. పివి.నరసింహా మూర్తి, డైరెక్టర్లు మానం ఆంజనేయులు, జేవీ.సత్య నారాయణ మూర్తి, స్టాలిన్, ఉప్పల పాటి పార్వతిదేవి, చంద్రశేఖర్, కామరాజు, జనార్ధనరావు, శాస్త్రి, రామచంద్రరాజు, రమణారావు, ప్రసాదరావు,కోటేశ్వరరావు, స్వామి, కృష్ణ మోహన్ రావు,రామకృష్ణ రావు,వైద్య నాథన్, పాల్గొన్నారు.

## అత్యవసర పరిస్థితులను ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి

**-విపత్తులపై యూత్ వాలంటీర్లకు అవగాహన**
**-విపత్తుల శాఖ డి.పి.ఎం రాజేశ్వరి**



**విజయనగరం బ్యూరో, జూన్ 22, మేజర్‌న్యూస్:** విపత్తుల వలన సంభవించే అత్యవసర పరిస్థితులను ఎదుర్కోడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని విపత్తుల శాఖ డి.పి.ఎం రాజేశ్వరి తెలిపారు. విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాల పై ప్రజలందరికీ అవగాహన కలిగించాలని తెలిపారు. శనివారం యూత్ హాస్టల్ నందు విపత్తుల బృందం తో యూత్ వాలంటీర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి పి ఎం రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలో ఇటువంటి అవగాహనా సదస్సులను నిర్వహించి ప్రజలకు అవగాహనా కలిగించాలని తెలిపారు. జిల్లాలో అవగాహనా కల్పించడానికి పలు గ్రూప్ లను ఎంపిక చేయడం జరిగిందని, ప్రకృతి వైపరిత్యాల ద్వారా సంభవించు హానికరం కలిగించే అంశములపై మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. వరదలు, తుఫాన్లు, అగ్నిప్రమాదములు, భూకంపాలు, గుండె పోటు సంభవించేటప్పుడు పిడిగులు పడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహనా కలిగిస్తారని తెలిపారు. విజయనగరం జిల్లాలో గంట్యాడ, గజపతినగరం, నెల్లిమర్ల, విజయనగరం, పూసపాటి రేగ, భోగాపురం, సంతకవిటి, వంగరమరియుబొబ్బిలి మండలాల్లో గల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అక్కడి ప్రజలంతా ఈ అవగాహనా సదస్సుల్లో పాల్గొనేలా రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇందులో శిక్షణ పొందిన వాలంటీర్లు కూడా పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశం లో తహసిల్దార్ రత్నం, ఎన్.డి.ఆర్.ఎఫ్ ప్రతినిధులు , యూత్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రధానం




**విజయనగరం కలెక్టరేట్, జూన్ 22, మేజర్‌న్యూస్:** జిల్లాలో వీటి అగ్రహారం పాఠశాల నందు ఈరోజు అంతర్జాతీయ యోగా దినోత్సవం నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మహిళాభివృద్ధి మరియు శిశు సం క్షేమ శాఖ తరపున నోడల్ ఆఫీసర్ విజయ కుమారి, ప్రసన్న, సిడిపిఓ విజయనగరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో పిల్లలకు బహుమతి ప్రధానం చేశారు.

## లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో యోగా వేడుకలు

**- యోగా గురువులకు సత్కరించటం ఆనందదాయకం**
**- లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్**



**శ్రీకాకుళం, జూన్ 22, మేజర్‌న్యూస్:** యోగా నిత్య జీవితంలో బాగమవ్వాలని లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్ శనివారం అన్నారు. స్థానిక నటుకుల వారి వీధిలోగల లైన్స్ క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో జరిగిన యోగ వేడుకలలో పొన్నాడ.రవి కుమార్ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం పదిలమని, యోగ కోసం ప్రతి దినం కొంత సమయాన్ని కేటాయిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా లైన్స్ క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో సత్కరించటం ఆనందంగా ఉందన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం శ్రీకాకుళం ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కే.సుధ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.యోగ గురువు రామారావు, మెంటార్ నటుకుల మోహన్ లు నగరంలో ఉన్న అందరి యోగా నారీమనులను బంగారు మెడల్స్ తో పాటు ప్రశంసా పత్రాలను అందించి, దుస్సాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ ఛైర్పర్సన్ బి. దేవ భూషణం, సెక్రటరీ టి. రాంగోపాల్, ట్రెసరర్ శిల్లా మణి, సభ్యులు బి. ఆంజనేయులు, జోగి భారతి, పొడుగు చరణ్, ఉర్లం శివతేజ మరియు యోగా గురువులు నాగేశ్వరావు, మురళీ, స్వాతి, నాగలక్ష్మి, పొగిరి కిరణ్, లక్ష్మి, గాయత్రి, దేవ లక్ష్మి, సుధా రాణి, రమ్య, కవిత, ఆర్ట్ ఆఫ్ లివింగ్ నంబల్ల కల్పన పాల్గొన్నారు.

## జూలై 12న పేద కళాకారులకు నిత్యవసరకులు పంపిణీ

**కళాకారుల సంఘ జిల్లా అధ్యక్షులు మిమిక్రీ శివ, అధికార ప్రతినిధి కూన అనీల్**



**శ్రీకాకుళం, జూన్ 22, మేజర్‌న్యూస్:** నిరుపేదలైన కళాకారులకు జూలై నెల 12న బాలసుబ్రమణ్యం స్వర నిరాజనం కార్యక్రమం నిర్వహించి సుమారు 150 మంది కళాకారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని కళాకారుల సంఘ జిల్లా అధ్యక్షులు మిమిక్రీ శివ, అధికార ప్రతినిధి కూన అనిల్ తెలిపారు. అంబేద్కర్ ఆడిటోరియంలో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. పేద కళాకారులను ఆదుకోవాలని లక్ష్యంతోనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత మూడు నెలలుగా కార్యక్రమాలు లేకపోవడంతో కళాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వేరే పనులకు వెళ్ళలేక ఆర్థిక ఇబ్బందులతో కళాకారులు సతమతం అవుతున్నారని ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. అధికార ప్రతినిధి కూన అనిల్ మాట్లాడుతూ సంఘం ఏర్పడిన గత ఐదేళ్లుగా అనేక కార్యక్రమాల నిర్వహించి వృద్ధ, పేద కళాకారులను ఆదుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు స్వప్న శ్రీను, కార్యదర్శి దాము, గౌరవ అధ్యక్షులు సింహాద్రి శ్రీను, సహాయ కార్యదర్శి మార్గదర్శి శ్రీను, వ్యవస్థాపక అధ్యక్షులు అరవింద్, కోశాధికారి భానుమతి, కోఆర్డినేటర్లు బొడ్డేపల్లి రాము, గండ్రెటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ.. నష్టం ఎవరికి..?

**-ఎం. ఎల్ .ఎస్ పాయింట్లు అసౌకర్యాలు**
**-బియ్యం పప్పు పంచదార నేలపాలు**
**-తూనికలో వ్యత్యాసం.. అధికారులు దడ**



**పార్వతీపురం రూరల్, జూన్ 22, మేజర్‌న్యూస్:** కార్డుదారులకు ప్రభుత్వం నెలవారి అందిస్తున్న నిత్యవసర సరుకులు భద్రపరిచే ఎం. ఎల్. ఎస్ పాయింట్లు అసౌకర్యాలు ఉన్నాయి. ప్రధానంగా పూర్తిస్థాయిలో గచ్చులు లేకపోవడం ఎక్కడికక్కడ తలుపులు శిథిలం కావడంతో నిత్యవసర సరుకులు బస్తాలు ఎలకల బారిన పడి నేలపాలు అవుతున్నాయి. దీంతో బస్తాల తూనికలో వ్యత్యాసము రావడంతో అధికారులు దడ పట్టుకుంది. ప్రతినెల కందిపప్పు ,పంచదార, బియ్యం వంటి నిత్తరసర సరుకులు ఈ ఎం ఎల్ ఎస్ కేంద్రం నుంచి ఆయా ఎఫ్ సి షాపులకు అలాగే అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేస్తుంటారు. అయితే అధికారులు చేయని తప్పులకు క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలు లేక జరుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు తెలియ నీ పరిస్థితి ఉంది. వివరాల్లోకి వెళ్తే పార్వతీపురం శివారు మార్కెట్ యార్డ్ ఆవరణలో గతం నుంచి ఎం ఎల్ ఎస్ పాయింట్ ఉంది. ఇకనుంచి గరుగుబిల్లితో పాటు కొమరడ, పార్వతీపురం మున్సిపాలిటీ, మండలానికి ప్రతినెల నిత్యవసర సరుకులు సరఫరా అవుతుంటాయి. సుమారు 16 టన్నుల బియ్యంతో పాటు పంచదార అలాగే



ఐసిడిఎస్ కు సంబంధించి కందిపప్పును ప్రభుత్వం సరఫరా చేస్తుంది. వీటితోపాటు అంగన్వాడి కేంద్రాలకు అలాగే మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బియ్యంతో పాటు రాగి జావా ,బెల్లము, నూనె వంటివి కూడా సరఫరా అవుతుంటాయి. వాస్తవానికి ఇక్కడ మౌలిక సదుపాయాలు మాత్రం అంతంత మాత్రమే ఉన్నాయని చెప్పాలి . అతిపెద్ద ఎంఎల్ఎస్ కేంద్రమైనప్పటికీ పూర్తిస్థాయిలో గచ్చులు లేకపోవడం, కిటికీలకు రక్షణ కరవడం తలుపులు సరిగా పడకపోవడంతో నిత్యం ఎలకలు స్వైరవిహారం చేస్తూ సరుకులను నాశనం చేస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో అనేకమంది ఉన్నతాధికారులు ఈ పాయింట్ను సందర్శించిన ఫలితం మాత్రం కనిపించలేదు. ఆ శాఖ డిఎం తోపాటు స్థానిక ఎమ్మార్వో అలాగే తూనికలు కొలతలు శాఖ అధికారులు పరిశీలించినప్పటికీ కనీసం ఉన్నతాధికారులకు ఇక్కడ స్థితిగతులను నివేదిక ఇవ్వకపోవడం విచారకరం. సంబంధిత పాయింట్ అధికారులు చిత్తశుద్ధిగా విధులు నిర్వహిస్తున్న ఎలకలు చేస్తున్న విధ్వంసం మూలంగా వారు నిందలు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. తప్పు చేయకుండా శిక్ష పడుతున్నట్లు వారు ఆవేదనకు గురవుతున్నారు. ఉన్నతాధికారుల స్పందించి మరమ్మతులకు నిధులు కేటాయించాలని లేకపోతే ప్రజలనుంచి వ్యతిరేకత వస్తుందని వారు అంటున్నారు. ఏదేమైనా విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించి ఎంఎల్ఎస్ పాయింట్ మరమతులకు చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

## నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి

**మేయర్ విజయలక్ష్మి**

**విజయనగరం టౌన్, జూన్ 22, మేజర్‌న్యూస్:** నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈరోజు నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన సాధారణ, అత్యవసర సమావేశాలు జరిగాయి. సాధారణ సమావేశంలో పొందుపరిచిన 14 అంశాలకు, అత్యవసర సమావేశంలో పొందుపరిచిన 6 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశం అనంతరం మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ అందరి సమిష్టి కృషితో నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుదామని అన్నారు. అధికారులు సమదృష్టితో ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తాగునీటి సమస్య లేకుండా గత ఐదేళ్లుగా నిరంతరాయంగా రోజు విడిచి రోజు మంచినీటి పంపిణీ జరుగుతుందన్నారు. ఇప్పటికే 11 వాటర్ ట్యాంకులను నిర్మించి తాగునీటి సమస్య లేకుండా చేశామన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ సమయంలో సరైన సమాచారం అందించాలని, నీటి పంపిణీలో కొన్ని ప్రాంతాలలో రంగు మారిన నీరు వస్తుందని,




వివిధ డివిజన్ల కార్పొరేటర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎం ఎం నాయుడు, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో ఎన్నికల నిర్వహణ విజయవంతం

**బొబ్బిలి అర్ డి ఓ సాయి శ్రీ**



**బొబ్బిలి, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యమైన అధికారులు, పోలీస్ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది అంతా సమిష్టి కృషితో, సమన్వయం తో పనిచేయటం వలన బొబ్బిలి నియోజక వర్గం సార్వత్రిక ఎన్నికల నిర్వహణ విజయవంతం చేయ గలిగామని బొబ్బిలి అర్ డి ఓ మరియు రిటర్నింగ్ అధికారి ఎ. సాయి శ్రీ అన్నారు. శుక్రవారం రాత్రి శ్రీ సూర్య రెసిడెన్సీ నందు బొబ్బిలి నియోజక పరిధిలో ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించిన అధికారులను సిబ్బందిని, మాస్టర్ ట్రైనర్లను అభినందించి సత్కరించే కార్యక్రమాన్నిఅర్ డి ఓ సాయి శ్రీ నిర్వహించారు. ఈసందర్భం ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ ప్రతి దశలోనూ ప్రత్యేకంగా పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్ నిర్వహణ లో ఎలాంటి సమస్యలు లేకుండా సిబ్బంది సమర్ధవంతంగా సేవలు అందించారన్నారు. సెక్టోరియల్ అధికారులు, బి ఎల్ ఓ లు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, రెవెన్యూ అధికారులు , రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది,ఏ ఎల్ ఎం టి లు అందించిన సహకారాం తో ప్రశాంత ఎన్నికల నిర్వహణ సాధ్యమైనదని అన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన బొబ్బిలి డి ఎస్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమన్వయం తోనే ఎన్నికల నిర్వహణలో విజయవంతం అయ్యామని ప్రత్యేకించి రిటర్నింగ్ అధికారిణి నిబద్ధత, సమయ స్ఫూర్తి, సమన్వయం ,ఎన్నికల కమిషన్ సూచనలు ఖచ్చితంగా పాటించటం తో ఎలాంటి సమస్యలు లేకుండా ఎన్నికలు నిర్వహించు కోగలిగామన్నారు. ముందుగా బొబ్బిలి రోటరీ క్లబ్ ప్రతినిధులు జె సి రాజు, తూముల కార్తిక్, శ్రీనివాసన్, ప్రవీణ్ కుమార్ లు ఎన్నికలు సమర్ధవంతం గా నిర్వహించి నందుకు కాను అర్ డి ఓ సాయిశ్రీని, బొబ్బిలి డి ఎస్ పి శ్రీనివాసరావు ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు, అనంతరం అర్ డి ఓ, డి ఎస్ పి, మున్సిపల్ కమీషనర్ తహసీల్దార్ లు చేతుల మీదుగా ఎన్నికలవిధులను సమర్ధవంతంగా నిర్వహించిన సహాయ రిటర్నింగ్ అధికారులకు, ఉప తాసిల్దార్లకు, సహాయ గణాంక అధికారులకు, సెక్టోరియల్ అధికారులకు,ఏ ఎల్ ఎం టి, బి ఎల్ ఓ తదితర సిబ్బందిని అభినందించి వారికి ప్రోత్సాహక బహుమతులు ,ప్రసంసాపత్రాలు అందించారు. కార్యక్రమాన్ని మాస్టర్ ట్రైనీ జె సి రాజు, ఏ ఎస్ ఓ సురేష్ కుమార్ నిర్వహించగా తహశీల్దార్లు త్రినాధ రావు నాయుడు,సులోచనా రాణి, రాజారావు, రాజ్య లక్ష్మీ, మున్సిపల్ కమీషనర్ ఎల్ రామ లక్ష్మీ, చీఫ్ సర్వేయర్ రవి శంకర్, బొబ్బిలి ఎం పి డి ఓ రవి కుమార్, డి టి లు సాయి కృష్ణ, చిన్నారావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## మావోల అడ్డాలో కలెక్టర్ సుడిగాలి పర్యటన!

**-గిన్నెలకోట పంచాయతి ఫరిధిలో రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు -రెండు రోజుల్లో రేషన్ పంపిణీ చేయాలి -జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత**

పెదబయలు, జూన్ 22: మేజర్ న్యూస్.. పెదబయలు మండలంలోని గిన్నెలకోట పంచాయతి ఫరిదిలోని తమలం, గబ్బర మామిడి, కురజంగి, కంచురాయి గ్రామాలలో అల్లూరి జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత సుడిగాలి పర్యటన చేశారు. శనివారం పెదబయలు మండలంలో పర్యటించారు పైన పేర్కొన్న గ్రామాలను కలుపుతూ సుమారు ఎనిమిది కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ముందు ఆయా గ్రామస్తులు రహదారి కోసం సమర్పించిన ఫిర్యాదు నేపథ్యంలో శనివారం ఆయా గ్రామాలను సందర్శించి గ్రామస్థులతో పలు విషయాలు చర్చించారు. గ్రామస్తుల అభ్యర్ధన మేరకు అక్కడి చెక్ డ్యాం పరిశీలించి వెంటనే మరమ్మత్తులకు అంచనాలు తయారు చేయాలని, అదనపు చెక్ డ్యాం నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా త్రాగు నీటి సమస్య ఉందని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా సమస్య పరిష్కారానికి చేపట్టవలసిన చర్యల గూర్చి ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులకు సూచనలు జారీ చేసారు. గత నెలలో రేషన్ సరఫరా జరగలేదని, ఈ నెలలో కూడా ఇంతవరకు రేషన్ అందలేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ రెండు రోజుల్లో గ్రామస్తులకు రేషన్ సరఫరా చేసి నివేదిక సమర్పించాలని మండల తహసిల్దార్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా తమలం గ్రామంలో ప్రాథమిక పాటశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వారికి అందుతున్న మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, పాట్యాంశాల భోధనపై విధ్యార్ధులతో ఆరా తీసారు. టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్ వెంటనే విద్యార్ధులకు పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసారు. చికిత్స పొందుతున్న బాలింత తో మాట్లాడి సకాలంలో మందులు వేసుకుంటూ



డాక్టర్ల సూచనలు పాటించాలని కోరారు. ఆసుపత్రిలో మందుల రికార్డులు పరిశీలించిన కలెక్టర్ మందుల కొరత లేకుండా చూడాలని, రానున్న వర్షాకాలంలో డయేరియా ప్రబలె అవకాశం ఉన్నందున అందుకు సంబంధించిన అన్ని మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ సిరఫ్, మాత్రలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**జీపులో పర్యటించిన కలెక్టర్:**

గిన్నెలకోట పంచాయతి ఫరిదిలోని తమలం, గబ్బర మామిడి, కురజంగి, కంచురాయి గ్రామాలలో పర్యటనలో భాగంగా సరియాపల్లి నుండి తమల0 వరకు సుమారు 03.50 కిలో మీటర్ల మేర రహదారి బాగు లేక కారు వెళ్ళలేని పరిస్థితిలో కలెక్టర్ కారు దిగి ఒక ప్రవేట్ జీపులో ప్రయాణించి తమలం చేరుకున్నారు. తమలంలో సన్నని రాళ్ళ బాటపై అతికష్టం మీద నడక సాగించి గ్రామానికి చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో కూడా జీపులో ప్రయాణించి సరియాపల్లి చేరుకొని అక్కడి నుండి జాముగూడ వెళ్ళారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పిహెచ్ సి వైద్యాధికారి డా. సత్యశ్రీ ,డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శివయ్య, ఇంచార్జ్ ఎంపిడిఓ పూర్ణయ్య, తహసిల్దార్, ఎంఇఓ కృష్ణ మూర్తి, గిరిజన సంక్షేమ ఎఇ రాముడు, జాముగూడ సర్పంచ్ అచ్చయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**నగరపాలక సంస్థ కమిషనర్**



**విజయనగరం టౌన్, జూన్ 22, మేజర్‌న్యూస్:** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడు అన్నారు. ఈ మేరకు నగరంలోని వివిధ ప్రాంతాలలో పరిసరాల పరిశుభ్రత పై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధక్కిన వీధి, బింగి వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న ప్రాంతాలను చూసి సిబ్బంది పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న అల్పాహార దుకాణం వద్ద సదరు వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లతో, చెత్తాచెదారాలతో పరిసరాలను అపరిశుభ్రంగా తయారు చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. వ్యాపారస్తులను పిలిచి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచులు, క్యారీ బ్యాగులు వంటివి వినియోగిస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీఎం పాఠశాల, బింగి వీధి, ధకిన వీధి ప్రాంతాల్లో పర్యటించామని అయితే పాఠశాలల పరిసరాలలో పరిశుభ్ర వాతావరణం ఉండాలని అన్నారు. అలాగే వీధులలో కూడా పర్యావరణానికి విఘాతం కలిగించిన వారి పట్ల చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు సమిష్టి కృషి అవసరమని అన్నారు.

## ఏపీ గవర్నర్ కార్యదర్శిగా హరి జవహర్ లాల్ నియామకం



**విజయనగరం కలెక్టరేట్, జూన్ 22, మేజర్‌న్యూస్:** గవర్నర్ కార్యదర్శిగా ముగ్గురు ఐఏఎస్ అధికారుల పేర్లను ప్రభుత్వం పరిశీలిన జరిపారు. వారు 2010 బ్యాచ్‌కు చెందిన కె.హర్షవర్ధన్, పోలా భాస్కర్, 2012 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్. చివరికి ఈ ముగ్గురిలో హరి జవహర్ లాల్ ని గవర్నర్ కార్యదర్శిగా నియమించటం జరిగింది. హరిజవహర్ లాల్ 24తేది సోమవారం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్ట నున్నారు. ఇప్పటి వరకు కార్యదర్శిగా వ్యవహరించిన అనిల్‌కుమార్ సింఘాల్ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ అయ్యారు.

## క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**సర్పంచ్ పి సునీత**



**దుంబ్రిగుడ, జూన్ 22, మేజర్‌న్యూస్:** గిరి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని గసభ పంచాయితీ సిపిఎం సర్పంచ్ పి సునీత చెప్పారు.మండలంలోని గసభ పంచాయితీ మొర్రిగుడ గ్రామంలో 6,7వ తరగతి విధ్యార్థులకు ప్రభుత్వం సప్లై చేసిన పాఠ్యపుస్తకాలను శనివారం ఆ పంచాయితీ సిపిఎం సర్పంచ్ పి సునీత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధ్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని చెప్పారు. చదువుతో పాటుగా, క్రమశిక్షణతో మెలగాలని చెప్పారు. ఉన్నత స్థాయిలో ఎదిగి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో గసభ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, వార్డుమెంబర్ లు పి సత్యనారాయణ, పి రాజ్ కుమార్, పాఠశాల ఛైర్మన్ పి దొరబాబు,పాఠశాల ఉపాధ్యాయులు విశ్వనాథ రాజు ,పౌలు, గురుమూర్తి పాల్గొన్నారు.

## భారతీయ చేనేతల ప్రదర్శన

**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** వివాహాలు, వేసవి కాలం కొరకు విభిన్న రూపాల్లో వినూత్న వస్త్రాలతో నగరవాసులకు పండుగ వాతావరణ అనుభూతిని కలిగించుటకు వస్త్రాలను నగరంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కమ్ సేల్ ద్వారా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు . ఈ ఎక్స్ పో 22 జూన్ నుండి 26 జూన్ వరకు హోటల్ గ్రీన్ పార్క్,వాల్తేరు మెయిన్ రోడ్, విశాఖపట్నం నందు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని అనేక ప్రాంతాల విభిన్న సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబించు మగ్గాల పై నేసిన ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ ఎక్స్‌పో నందు భారతదేశం అంతటా ఉన్న నేత కార్మికులు 50శాతం వరకు తగ్గింపుతో వేలాది రకాల సిల్క్ కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజ్‌లు, కుర్తీలు మొదలైన వాటిని అన్నింటిని ఒకేచోట అమ్మకాలకు అందుబాటులో ఉంచారన్నారు.

## ఎంపీని కలిసిన టిడిపి నాయకులు



**దేవరాపల్లి, జూన్ 22, మేజర్‌న్యూస్:** మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు శనివారం అనకాపల్లి బీజేపీ కార్యాలయంలో సీఎం రమేష్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తితో పాటు పలువురు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దేవరాపల్లి సమస్యలు ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు.

## ఓఎస్డీ సుధాకర్ బాబు సేవలు అమోఘం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ



**శ్రీకాకుళం, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఓఎస్డీ సుధాకర్ బాబు సేవలు అమోఘం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ అన్నారు 2019 లో రాజీవ్ గాంధీ యూనివర్సిటీకి వచ్చారు అని గతంలో సుధాకర్ బాబు ప్రొఫెసర్ గా ఆంధ్రయూనివర్సిటీ లో విధులు నిర్వహించే వారు అని చెప్పారు. రిటైర్మెంట్ అనేది వయస్సుకే కాని మనసుకు కాదు అని చెప్పారు ఆంధ్ర యూనివర్సిటీ లో రిటైర్మెంట్ అయ్యాక ఆర్జియుకేటి కి వచ్చి చాలా ఉల్లాసంగా విధులు నిర్వహించే వారని చెప్పారు ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ,డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరి నాయుడు,డీన్ వెల్ఫేర్ రవి, డాక్టర్ గోవర్ధనరావు, విశ్వానాథ్ బీసై,డాక్టర్ శ్రీనివాసరావు, తేజకిరణ్, దిలీప్ కుమార్, కుట్టి, సింహాచలం, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకేంద్రం ఎంపిహెచ్ఇఓ సస్పెన్షన్

## -ఫార్మసిస్ట్‌కు షోకాజ్ నోటీసు - డాక్టర్‌కు మందలింపు -జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత



**పాడేరు, జూన్ 22, మేజర్‌న్యూస్:** పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతి ఫరిదిలోని తమలం, గబ్బర మామిడి, కురజంగి, కంచురాయి గ్రామాలకు రహదారి ఏర్పాటు చేసే వరకు ఓటింగ్ లో పాల్గొనమని ఎన్నికల ముందు గ్రామస్తులు తెలియ పరిచిన నేపధ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆయా గ్రామమలలో పర్యటించారు. అందులో భాగంగా ముందుగా పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆక్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఎంపిహెచ్ఇఓ జే. వెంకటరావు ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసారు. ఎంపిహెచ్ఇఓ మలేరియా సీజన్ ప్రారంభమైనప్పటికీ క్షేత్ర స్థాయి పర్యటనలు చేయకపోవటం, రికార్డులు నిర్వహించకపోవటం, విదులపట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించటం తదితర కారణాల వల్ల ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. అదేవిధంగా ఫార్మసిస్ట్ గా విధులు నిర్వహిస్తున్న పావని ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఓఆర్ఎస్ ప్యాకెట్ల వివరాలు స్టాక్ రిజిస్టర్ లో నమోదు చేయకపోవటమే కాకుండా స్టాక్ వచ్చిన విషయం కూడా తనకు తెలియకపోవటం పట్ల కలెక్టర్ ఆగ్రం వ్యక్తపరుస్తూ ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డిఎంహెచ్ఓ డా. జమాల్ బాషాను కలెక్టర్ ఫోన్ లో ఆదేశించారు. ఒక గర్భిణీ స్త్రీ ముందుగానే ఆసుపత్రిలో జాయిన్ ఐనప్పటికీ ప్రసవ సమయంలో డాక్టర్ హాజరు కాకుండా నర్స్ కు అప్పగించినట్లు తెలుసుకున్న కలెక్టర్ డా. సత్యశ్రీ పై తీవ్ర ఆగ్రహంతో మందలించారు. ప్రసవ సమయంలో డాక్టర్ తప్పనిసరిగా హాజరు కావాలని, ఇటువంటివి పునరావృతం ఐతే తీవ్ర చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వైద్యాదికారులను కలెక్టర్ హెచ్చరించారు.

# సర్పంచుల గుర్తింపు కార్డులో జగన్ మోహన్ రెడ్డి ఫోటో తొలగించారా

## -సర్పంచుల గుర్తింపు కార్డులోవెంటనే చంద్రబాబు నాయుడు ఫోటో పెట్టాలి -డీపీవో ను వినతిపత్రం ఇచ్చిన సర్పంచులు



**పాడేరు, జూన్ 22, మేజర్‌న్యూస్:** సర్పంచులకు ఇస్తున్న గుర్తింపు కార్డులో మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి ఫోటోను తొలగిస్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఫోటోతోముద్రించిన గుర్తింపు కార్డులను సర్పంచులకు అందజేయాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో సర్పంచులసంఘం ప్రతినిధులు డీపీవో కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దారెలసర్పంచ్'పాంగి .పాండురంగ స్వామి మీడియాతో మాట్లాడుతూ... రాష్టంలోకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ప్రమాణం చేసిన సంగతి అదికార్లు మరిచిపోయి మాజీ ముఖ్యమ%శీ%త్రి ఫోటోను సర్పంచులకు ఇచ్చే గుర్తింపు కార్డులోఇంక వుండడం సరికాదని, తక్షణమే చంద్ర బాబు నాయుడు పోటో ఉండేలా అధికార్లు చర్యలు తీసుకోవాలని కోరుతూ డీపీవోకు వినతి పత్రం అందజేశామన్నారు.డీపీఓ స్పందించి గుర్తింపు కార్డులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫొటో ఉండేలా చూస్తామని శానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ బాకూరు. వెంకటరమణ రాజు, పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుల్లి. ఉషారాణి, అండీభ సర్పంచ్ తామర్ల. సత్యనారాయణ, అరకు అసెంబ్లీ తెలుగు యువత ఆర్గనైజషన్ సెక్రటరీ కర్జ. అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పిఎస్ పేటలో భక్తి శ్రద్ధలతో సహస్ర హనుమాన్ చాలీసా పారాయణ



**చోడవరం, జూన్ 22, మేజర్‌న్యూస్:** చోడవరం పంచాయతీ పరిధి పి ఎస్ పేట గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో సహస్ర హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆంజనేయ స్వామి వారికి తమలపాకులు,నిమ్మకాయలు ,సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమరసత సేవ ఫౌండేషన్, ఆలయ కమిటీ భక్తుల ఆధ్వర్యంలో సహస్ర హనుమాన్ చాలీసా పారాయణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో పొట్నూరు, అయినాడ గ్రామాల సామాజిక భవనాలు

## ఎప్పుడు నేలకూలితాయో అని ప్రజలు భయాందోళన



**పద్మనాభం, జూన్ 22, మేజర్‌న్యూస్:** మండలంలో పొట్నూరు,అయినాడ గ్రామాలలో ఉన్న సామాజిక భవనాలు శిధిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాంధోళన చెందుతున్నారు. వీటి స్థానంలో నూతన సామాజిక భవనాలు నిర్మించాలని గతంలో అధికారులకు, పాలకులకు చెప్పినా ప్రయోజనం లేకపోయిందని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల మధ్య ఉండడం వల్ల వీటిని రచ్చబండలుగా ప్రజలు ఉపయోగిస్తున్నారు. అంతే కాకుండా సభలు, సమావేశాలు లేనిపుడు కూరగాయల వ్యాపారస్తులు వ్యాపారం చేసుకుంటున్నారు. అయితే ఈ భవనాల స్థంబాలు,శ్లాబులు పూర్తిగా శిధిలమై రేపోమాపో కూలడానికి సిద్దంగా ఉన్నాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులు చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి తమ గ్రామాలలో నూతనంగా సామాజిక భవనాలను నిర్మించాలని ,ప్రమాదం జరగక ముందే పాత సామాజిక భవనాలను నేలకూల్చాలని ప్రజలు కోరుతున్నారు.

# మండల విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం



**అనకాపల్లి, జూన్ 22, మేజర్‌న్యూస్:** అనకాపల్లి జిల్లా మండల విద్యాశాఖ అధికారులు 1, 2 లతో విశాఖపట్నం ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి. విజయ్ బాస్కర్ శనివారం అనకాపల్లి టౌన్ గర్ల్స్ హైస్కూల్లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులతో పలు అంశాలపై సమీక్ష జరిపారు. విద్యార్థుల కిట్లకు సంబంధించి అన్ని మండలాల్లో ఇప్పటివరకు వచ్చిన అచ్చుపుస్తకాలను, నోటు పుస్తకములు వెంటవెంటనే పిల్లలకు పంపిణీ జరిగేలా మండల విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తెలియజేసారు. అప్పటి వరకు బడిలో చేరని పిల్లల వివరాలను మధ్యలో బడిమానివేసిన పిల్లలను అన్ని ఆవాస ప్రాంతాల్లో ఇంటి ఇంటికి వెళ్ళి సర్వే చేసి వారిని బడిలో చేర్పించాలని తెలియజేసారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో కిట్లకు సంబంధించి ప్రతీ ఐటమ్ ఒక్కొక్క ఇంచార్జీలను నియమించాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన అన్ని ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు ఖచ్చితంగా ప్రభుత్వం నిర్దేశించిన అచ్చు పుస్తకాలను కొనుగోలు చేయుటకు ఇండెంట్లు పెట్టాలని, ఆ మేరకు మండల విద్యాశాఖ అధికారులు ప్రైవేటు యాజమాన్య పాఠశాలల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని తెలియజేసారు. 2023-24 సంవత్సరం పాఠశాలలో వున్న అందరి పిల్లల ప్రోగ్రషన్ ప్రక్రియ ను ఖచ్చితంగా 2024-25 సంవత్సరానికి పూర్తి చేయాలని తెలియజేసారు. అధికంగా పెండింగ్ వున్న మండలాల విద్యాశాఖ అధికారులకు మెమోలు జారీ చేయవలసిందిగా జిల్లా విద్యాశాఖ అధికారిణి కి తెలియజేసారు. మధ్యాహ్న భోజన పథకం అమలు లో ఖచ్చితంగా సమయానుకూలంగా రైస్, చిక్కలు, గ్రుడ్ల ఇండెంటులను సమర్పించాలని తెలియజేసారు. మండల విద్యాశాఖ అధికారులు అందరు మండలాల్లో నిర్వహించే సమావేశాలకు విధిగా సమయానికి హాజరు కావాలని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు 1, 2 లు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ప్రతీ నెలా ఖచ్చితంగా వారి నెలవారీ పాఠశాలల పర్యటన షెడ్యూల్ సమర్పించాలని, ఆ ప్రాప్తికి సందర్శనలు చేయాలని తెలిపారు. ఈ సమీక్షా కార్యక్రమానికి ఎమ్ వెంకట లక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారిణి వారు, అప్పారావు, జిల్లా ఉప విద్యాశాఖాధికారి, సెక్టోరల్ అధికారులు హాజరైయ్యారు.

# అయ్యన్నపాత్రుడుకు అత్యున్నత గౌరవం

## -సీనియర్ నాయకునికి దక్కిన సముచిత స్థానం -సభాపతిగా ఏకగ్రీవ ఎన్నిక

**నర్సీపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నర్సీపట్నం శాసనసభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడుకు శాసనసభ అత్యున్నత పదవి లభించింది. సీనియర్ నాయకుడైన అయ్యన్నపాత్రుడుకు తెలుగుదేశం పార్టీ సముచిత గౌరవం అందించింది. శాసనసభ సభాపతిగా ఆయన శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు అచ్చెంనాయుడు, సత్య కుమార్ యాదవ్ సాదరంగా అయ్యన్నపాత్రుడును సభాపతి స్థానానికి తీసుకు వెళ్లడంతో సభలో కరతాళ ధ్వనులు మిన్నంటాయి. సీనియర్ నేతకు పార్టీ సమచిత స్థానం ఇచ్చి గౌరవించడంతో నర్సీపట్నం పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అయ్యన్నపాత్రుడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఒకే పార్టీలో ఉంటూ, ఒకే నియోజకవర్గం నుంచి10 సార్లు పోటీ చేసి రికార్డు సృష్టించారు. రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 1983లో ఎన్టీ రామారావు సారథ్యంలో తెలుగుదేశం పార్టీ తరఫున నర్సీపట్నం ఎమ్మెల్యేగా మొట్టమొదటిసారి ఎన్నికయ్యారు. ఇప్పటివరకు 7 పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికై ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు మంత్రివర్గాల్లో 5 సార్లు మంత్రిగా పనిచేశారు. 1996 లో అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అధికార పార్టీపై విమర్శల వర్షం కురిపించి, వెన్ను చూపని నాయకుడిగా, కార్యకర్తలకు అండదండగా



నిలిచారు. ఒకే నియోజకవర్గం నుంచి 7 పర్యాయాలు గెలిచిన ఘనత ఆయనకే దక్కింది. పార్టీలో తనదైన శైలిని ముద్ర వేసుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు అయ్యన్నపాత్రునికి గత ఎన్నికలలో ఎన్నడూ రానంత ఘనమైన మెజారిటీ ఇవ్వడమే కాకుండా , శాసన సభాపతిగా అత్యున్నత గౌరవం అందించాయనే చెప్పాలి.

# లబ్దిదారులందరికి సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ

## జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్ ఆదేశం



**పాడేరు, జూన్ 22, మేజర్‌న్యూస్:** అర్హులైన లబ్దిదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ భావనా పశిష్ట ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పౌర సరఫరాల అధికారులు, జిసిసి డివిజనల్ మేనేజర్లు, ఎం ఎల్. ఎస్. పాయింట్ ఇన్చార్జిలతో శనివారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ నెలా 30వ తేదీ నాటికి నిత్యావసర సరుకులు సంబంధిత స్టాక్ పాయింట్లకు చేరవేయాలని సూచించారు. బియ్యం నిల్వలలో చీడ పీడలు లేకుండా కార్డుదారులకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని స్పష్టం చేసారు. ఎం. ఎల్. ఎస్ పాయింట్లను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ప్యాక్ చేయబడిన వస్తువుల బరువులు ఖచ్చితత్వాన్ని ధృవీకరించడానికి తగిన యంత్ర పరికరాలను కొనుగోలు చేయాలని అన్నారు. ఎం. ఎల్. ఎస్ పాయింట్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిత్యావసర సరకులు అన్లోడ్ చేస్తున్నప్పుడు అలాగే పంపిణీ చేసే సమయంలో సరుకులు గడువు తేదీని నోట్ చేసుకోవాలని పేర్కొన్నారు.

వస్తువులు నిల్వ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. లబ్దిదారులకు సరుకులు పంపిణీలో తూకం సక్రమంగా ఉండాలని అన్నారు. పంపిణీ చేసిన సరుకుల్లో వ్యత్యాసాలు ఉంటే చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. నిత్యావసర సరుకులు వృధాచేయకూడదని అన్నారు. జి.పి. ఎస్ సిస్టం ఉన్న వాహనాలలో సరుకులు రవాణా చేయాలని చెప్పారు. నిత్యావసర సరుకులు పంపిణీ కి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఐసిడి ఎస్కు, ఎం. డి. యు వాహనాలకుసరుకులు పంపిణీ చేసేటప్పుడు స్టెన్సిలింగ్ చేయాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి సి. శ్రీహరి, డి. ఎం. గణేష్ జి.సిసి డి. ఎంలు, ఎం. ఎల్. ఎస్ పాయింట్లు ఇన్చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

# అపోలోలో విజయవంతంగా అరుదైన రీప్లేస్మెంట్ చికిత్స

**ఆరిలోవ, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఆరిలోవలోని అపోలో ఆస్పత్రిలో మల్టిపుల్ కోమోరబిడిటీస్ ఉన్న నాన్- సర్జికల్ ట్రాన్సీకాథెటర్ రీప్లేస్మెంట్ చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు ఆస్పత్రి వైద్యులు దివ్య కుమార్ బారువా తెలిపారు. బృహద్ధమని సంబంధ రేసిస్ అనేది ఒక సాధారణ రుర్మత అని దీనిలో బృహద్ధమని కవాటం కక్క సంకుచితం ఎడమ జఠరిక ప్రవాహం అవరోధానికి దారితీస్తుందని తెలిపారు. ప్రస్తుతం, ట్రాన్స్ కాథెటర్ బృహద్ధమని కవాట భర్తీ అనేది ఒక కొత్త పద్ధతిలో చికిత్స విధానం తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉందన్నారు. వృత్తిరిత్య వైద్యుడైన 63 ఏళ్ల తమ పేషెంట్ మధుమేహం, రక్తపోటు వంటి రుగ్మతలతో ఐదేళ్ల కిందట సీఏబీజీ బాధపడుతున్నాడని తెలిపారు. అతనికి అసిటిస్ కూడా ఉందన్నారు. దీని చికిత్స కోసం ఆస్కిటిస్ ఫ్లూయిడ్ ఇచ్చామని, అతని కరోనరీ యాంజియోగ్రామ్ లో ఎలడీ వ్యాధిని కూడా చూపించిందని తెలిపారు. దీని కోసం స్టెంటింగ్ చేశారని తెలిపారు. హార్ట్ టీమ్ తో చర్చించిన




తర్వాత, తాము బృహద్ధమని కవాటం ట్రాన్స్ కాథెటర్ రీప్లేస్మెంట్ చికిత్స విజయవంతంగా చేశామని తెలిపారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం కుదుటపడిందని తెలిపారు. అతని మూత్రపిండాల పనితీరు కూడా సాధారణ స్థితికి చేరిందని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. దివ్య కుమార్ బారువా, సీడీవో రామచంద్రరావు, డాక్టర్ నందకిషోర్ పాణిగ్రహి, అపోలో వైద్యులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

## వన్ టౌన్ బి.వెంకటరావు

**విజయనగరం క్రైమ్, జూన్ 22, మేజర్‌న్యూస్:** మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు, యువతకు వివరించి వారిని మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చేసేందుకు వన్ టౌన్ పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు ఆధ్వర్యంలో వన్ టౌన్ ఎస్సై లు నరేష్, నవీన్ పడాల్ మహారాజా, ఆదిత్య డిగ్రీ కళాశాలను సందర్శించి, విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్దులకు మత్తు కలిగించే గంజాయి, డ్రగ్స్, హెరాన్, గుట్కా, ఖైనీలను వినియోగించి, జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరా



రు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ఈ ప్రమాణం చేయించారు.

# విద్యార్దులకు నాణ్యమైన విద్యను అందించండి

## ఐటిడిఏ పిఓ వి. అభిషేక్



**జి.మాడుగుల, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించి నాణ్యమైన విద్యను అందించాలని ఐటిడిఏ పి. ఓ , వి. అభిషేక్ ఆదేశించారు. శనివారం నుర్మతి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికలు, బొయితిలి బాలురు ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్దుల హాజరు పట్టీలను తనిఖీ చేసారు. ఎంత మంది పాఠశాలకు రావడం లేదని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్దులు చర్మ వ్యాదులతో బాధపడుతున్నారని గుర్తించి, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్‌తో మాట్లాడి తగిన వైద్యం అందించాలని ఆదేశించారు. చర్మవ్యాదులు రాకుండా పరిశుభ్రంగా ఉండాలని విద్యార్దులకు సూచించారు. వేడి నీటితో బట్టలు ఉతకాలని అన్నారు ఆశ్రమ పాఠశాలలో విద్యార్దుల మొత్తం ఎంత మంది ఉండాలి ? ఎంత మంది హాజరు కాలేదని ఉపాధ్యాయులను ప్రశించారు. సికిల్ సెల్ ఎనిమియా లక్షణాలు ఉన్న విద్యార్దులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తలిదండ్రులు సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని విద్యార్దులకు సూచించారు. ప్రతీ విద్యార్ది ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు . పరీక్షలో చూసిరాతలకు అలవాటు పడకూడదని విద్యార్దులకు సూచించారు. పది తరువాత ఏం చదువుతారని విద్యార్దులను ప్రశించారు. ఇంటర్మీడియట్ చదువుతామని విద్యార్దులు జవాబిచ్చారు. ఆతరువాత డిగ్రీలో చేరి బాగా చదువుకోవాలని చెప్పారు. అనంతరం 10 వతరగతి విద్యార్దులకు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలు బోధించారు. సాంఘిక శాస్త్రంలో పాఠాలు బోధించి పాఠ్యాంశంలోని ప్రశ్నలు వేసి జవాబులు అడిగి తెలుసుకున్నారు.. గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో మాట్లాడి ప్రతీ విద్యార్ది పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతీ విద్యార్ది పాఠశాలలోనే ఉండాలన్నారు. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి పాఠశాలకు తీసుకుని రావాలని అన్నారు. మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్ సహాయం తీసుకోవాలన్నారు. 10 వతరగతిలో ఎంత మంది విద్యార్దులున్నారని అడిగి తెలుసు కున్నారు. పది విద్యార్దులపై ప్రత్యేక శ్రద్ద పెట్టాలని స్పష్టం చేసారు. గిరిజన విద్యార్దులకు నాణ్యమైన విద్య అందించాలని చెప్పారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నను కలిసిన కిడారి



**పాడేరు, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గా పదవి చేపట్టిన నర్సీపట్నం శాసన సభ్యులు మాజీ మంత్రివర్యులు ఉత్తరాంధ్ర టైగర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని విజయవాడలో అరకు పార్లమెంట్ అధ్యక్షులు, మాజీ మంత్రి కిడారి. శ్రావణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో ఫోన్లో మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంస్కరణలతో కూడిన పాలన అందించేందుకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాంతాల వారిగా అభివృదే ధ్యేయంగా సమభావంతో ప్రాంతాల వారిగా మంత్రి పదవులు ఇచ్చి అభివృధి పదంలో నడిపేందుకు ప్రణాళిక రూపొందించారని, అందులో భాగంగానే ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మన ఉత్తరాంధ్ర టైగర్ నర్సీపట్నం నియోజకవర్గం శాసన సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ని ఉన్నతమైన అసెంబ్లీ స్పీకర్ సభాపతి గా ఇచ్చి ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తన అవునత్యాన్ని చాటుకొన్నారని కొనియాడారు.

# చిన్నారుల ఆరోగ్య పై శ్రద్ధ చూపాలి

## డి ఎం ఓ జగన్మోహన్రావు



**పార్వతీపురం రూరల్, జూన్ 22, మేజర్‌న్యూస్:** చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఓ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. పట్టణంలో 7వ వార్డు అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు.ఈ మధ్యకాలంలో పిల్లల్లో ఎవరికైనా జ్వరాలు,సీజనల్ వ్యాదులు నమోదు అయ్యాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.కేంద్రంలో మరియు పరిసరాల్లో శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని,దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తపడాలని సూచించారు. పట్టణాల్లో ప్రస్తుత సీజన్లో డెంగ్యూ జ్వరాలకు ఆస్కారం ఉన్నందున జ్వర లక్షణాలను గుర్తిస్తే వెంటనే జిల్లా ఆసుపత్రిలో డెంగ్యూ నిర్ధారణ కేంద్రంలో(ఎస్-ఎస్ హెచ్)పరీక్షలు జరిపించాలన్నారు.అదేవిధంగా జ్వర లక్షణాలను బట్టి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు.చిన్నారుల త్రాగు నీరు పరిశుభ్రంగా ఉండాలని,ఆహార పదార్థాలపై మూతలు ఉండేలా చూసుకోవాలని సూచించారు.పిల్లల ఆరోగ్య నిర్వహణ రికార్డులో బరువు,ఎత్తు,శారీరక ఎదుగుదల వివరాల నివేదికలు పరిశీలించి, వాటి సాధారణ,అసాధారణ స్థితిని అక్కడ స్వయంగా పిల్లల బరువు తనిఖీ చేసి సరిచూచారు.ప్రతీ నెలా పురోగతి లేనట్లు గుర్తిస్తే ఎన్ఆర్సి కేంద్రంలో చేర్చాలన్నారు.వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పిల్లల ఆరోగ్యా న్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అనంతరం డిఎంఓ డ్రైడే కార్యక్రమం ఏ మేరకు నిర్వహిస్తున్నారో వార్డులో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనా రాయణ, ఏఎన్ఎం కిరణ్మయి, అంగన్వాడీ టీచర్ లత,సిబ్బంది తదితరులు ఉన్నారు.

# శాసనసభ స్పీకర్ అయ్యన్నకు చోడవరం నాయకుల అభినందనలు



**చోడవరం, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా ఏకగ్రీవంగా ఎన్నికై శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన చింతకాయల అయ్యన్నపాత్రుడు కు చోడవరం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ ఎన్ రాజు, జనసేన నాయకులు సిరిపురపు రమేష్, అడ్డూరు గ్రామ సర్పంచ్ దాసరి అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యులు ఎలమంచిలి రమేష్, రాయపురాజుపేట గ్రామ సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు, భోగాపురం గ్రామ సర్పంచ్ పొలిమేర బాలాజీ తదితరులు అయ్యన్నను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# పేకాట స్థావరాలపై పోలీసులు ముమ్మర తనిఖీలు




**ఆనందపురం, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలంలో పేకాట స్థావరాలపై శనివారం పోలీసులు తనిఖీలు చేశారు పేకాట స్థావరములకు సంబంధించిన అనుమానిత వ్యక్తులు యొక్క వాహనాలను తనిఖీ నిమిత్తం ఆనందపురం పోలీసు వారు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ లేఅవుట్ దగ్గరలో దిబ్బడపాలెం రోడ్లో మరియు గుత్తా శ్రీనివాసరావు కు చెందిన చందన హొటల్ గంభీరం రోడ్డు లో ముమ్మరంగా వాహనములు తనిఖీ చేసి ప్రతి వాహనం యొక్క వివరములను నమోదు చేసుకోవడమైనది ఇందులో భాగంగా ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు ఆధ్వర్యంలో రెండు టీములుగా ఏర్పడి ఒక టీముకు ఎస్సై సంతోష్ కుమార్, రెండవ టీముకు ఎస్సై శివ వారి యొక్క సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు ఈ సందర్భంగా సిఐ తిరుపతిరావు మాట్లాడుతూ పేకాట ఆడినట్లయితేఆడినట్లయితే కఠిన చర్యలు తీసుకోబడతాయని ఎక్కడ పేకాట ఆడరాదు అన్నారు.

## ఈనెల 24వ తేదీన ప్రారంభంకానున్న

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

## జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి



**అనకాపల్లి ప్రతినిధి, జూన్, 22, మేజర్‌న్యూస్:** ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే (స్పందన)కార్యక్రమానికి బదులుగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టమ్) ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యల పరిష్కార కోసం దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చేవారికి త్రాగేందుకు మంచినీరు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుం దన్నారు. అదేవిధంగా వికలాంగుల కోసం ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని జిల్లా రెవెన్యూ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

## భగవన్నామ స్మరణం ముక్తికి సోపానం



రేగిడి, మేజర్‌న్యూస్: భగవన్నామ స్మరణం ముక్తికి సోపానమని వక్తలు ఎన్ వి రమణ, ప్రకాశరావు ,అప్పలరాం లు అన్నారు.శనివారం ఏరువాక పూర్ణిమ సందర్భంగా రేగిడి దత్త పీఠం లో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో దత్త పీఠ కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు అధ్యక్షతన దత్త జ్ఞాన బోధ సభ జరిగింది.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హృదయమనే భూమి లో అహంకార మమకారమనే కలుపు మొక్కలను పీకేసి క్రమశిక్షణ అనే నాగలితో దున్ని ప్రేమ అనే జలం నింపి సత్యం అనే విత్తు నాటి అరిషడ్వర్గాలు అనే మృగాల బారినుండి స్మరణ అనే కంచె వేస్తే నామమనే మొక్క మొలిచి బ్రహ్మానందం అనే పంట పండుతుందన్నారు . ముందుగా దత్త పాదుకా పూజ, గణపతి హెూమం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఆధ్యాత్మిక వేత్తలకు సత్కారాలు, నారాయణ సేవ సేవ జరిగాయి.ఈ కార్యక్రమంలో సామంతుల దామోదర రావు, యర్రాపాత్రుని భాస్కర రావు, కుడుతుల మురళీ, జల్లు శివ, పూతి బాలకృష్ణ పాల్గొన్నారు.

## రెల్లివలసలో ఉచిత దంత వైద్య శిబిరం



పూసపాటిరేగ, జూన్ 22, మేజర్‌న్యూస్: మండలంలోని రెల్లివలస పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన దంత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి చెందిన దంత వైద్య శిబిరం రెల్లివలసలో శనివారం నిర్వహించగా ఈ శిబిరాన్ని తెదేపా నాయకుడు, సర్పంచ్ ప్రతినిధి అయిన ఇజ్రోతు ఈశ్వర రావు లాంఛనంగా ప్రారంభించారు.దంత పరీక్షలను చేయించుకునేందుకు మొత్తం 150 మంది శిబిరానికి హాజరవుగా వారందరికీ దంత సమస్యలపై పరీక్షలను దంత వైద్య ప్రత్యేక నిపుణులు కే శ్రీనివాసరావు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ప్రమాదకరంగా ఉన్న దంతాలను ఆసుపత్రిలో తగిన చికిత్స చేసేందుకు సోమవారం ఆసుపత్రిలో నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా శ్రీనివాసరావు అన్నారు. ఆస్పత్రికి వచ్చే వారికి ఉచితంగా బస్సులను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ ఎన్ శ్రీనివాసరావు, గ్రామ నాయకులు పతివాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సహిత విద్యా కార్యక్రమాన్ని సద్విని చేసుకోవాలి



తెర్లాం, జూన్ 22, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మానసిక శారీరక అంగవైకల్య విద్యార్థులకు ప్రవేశపెట్టిన సహిత విద్యా కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలనీ మండల విద్యాశాఖ అధికారి జె. త్రినాధ రావు పిలుపునిచ్చారు. శనివారం నందిగా గ్రామంలో ఆర్ . ప్రకాష్ అనే విద్యార్థి తొమ్మిదవ తరగతి చదువుతున్న అతని ఇంటికి వెళ్లి గృహ సందర్శన చేశారు. ఆ విద్యార్థికి అందిస్తున్న సహిత విద్యను సంబంధిత అధికారిని అడిగి తెలుసుకున్నారు. మానసిక శారీరక భౌతిక కౌశలాలు గురించి ఆ విద్యార్థి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. శారీరక మానసిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు సహిత విద్య విభాగం వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐ. ఈ.అర్. టి టీచర్ ఏ.సూర్యా రావు విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు వారి నారీ భేరిలో పాల్గొన్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష




పలాస/మందస, జూన్ 22, మేజర్‌న్యూస్: శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకి ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించిరు విజయవాడ హెూటల్ మురళీ ఫార్చ్యూన్‌లో మహిళా వింగ్ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు వారి నారీ భేరి లో పాల్గొని పలాస నియోజకవర్గానికి తమ వంతు సహాయం చేయాలి అన్ని దానికి తన మద్దతు ప్రభుత్వ పరంగా పూర్తిగా ఉంటుందని కొన్ని గ్రామాలు దత్తత తీసుకొని పల్లెలలో మహిళలయొక జీవన ప్రమాణాలు మార్చాలని. ఉద్దనం మహిళలకు కష్టబడే వ్యక్తిత్వం ఉందని అయితే వారికి సరైన పరిశ్రమలు ఏర్పరిస్తే వారి యొక్క జీవన ప్రమాణాలు మారుతాయని దానికి సహకరించాలని కోరారు ఈ కార్యక్రమం లో మొత్తం శాసనసభకి ఎన్నికైన మహిళలు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సమావేశం ఉన్న ప్రజా సంక్షేమం కోసమే



పలాస /మందస, జూన్ 22, మేజర్‌న్యూస్: శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీ సమావేశం అమరావతిలో ఆమె ఉన్న ప్రజా సంక్షేమం కోసం మాత్రమే ఎమ్మెల్యే అని నిరూపించారు శ్రీకాకుళం జిల్లా పలాస నియోజవర్గంలో పలాసలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి సాయి కాలనీలో రోడ్లపైనే మురుగు నీరు చేరింది. స్థానికులు ఇబ్బంది గురవుతున్నారని సమాచారం తెలియడంతో ఎమ్మెల్యే గౌతు శిరీష ఆమె ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది జేసిబి సహాయంతో సమస్యను పరిష్కరించారు పలాస నియోజకవర్గం ప్రజానీకం కోరుకున్న నాయకురాలు ఎన్నుకున్నామని హర్షం వ్యక్తం చేస్తున్నారు ప్రజలు కావాల్సింది ప్రజల సమస్యలు తీర్చే పాలనే కదా పుర ప్రజలకు కావాల్సింది అసెంబ్లీ సమావేశం వ్యక్తిగత దూషణలకు తావివ్వకుండా ప్రజా సమస్యలపై దృష్టి అని నిరూపించుకున్నారు.

# పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పాచిపెంట, జూన్ 22, మేజర్‌న్యూస్: పత్తి పంట ప్రస్తుతం 15 నుండి 25 రోజుల వయస్సు ఉందని రైతులు సరియైన విధానంలో ఎరువులతో పాటుగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. మండలంలో శనివారం మాతుమూరు రైతు భరోసా కేంద్రం పరిధిలో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఎక్కువగా బీటీ రకాలను పండిస్తూ ఉండడం వలన రసం పీల్చు పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని అన్నారు. ముందుగా ఐదు శాతం వేప కషాయం లేదా వేప నూనె ఒక లీటర్ నీటికి ఐదు మిల్లీ లీటర్లు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. భూమిలో సరి అయిన తేమ లేకపోవడం వలన రైతులు ఎరువులు వేయడం ఆలస్యం చేస్తున్నారని, డిఏపి లేదా కాంప్లెక్స్ ఎరువులను ఆఖరి దుక్కిలోనే వేసేయాలని అలా వెయ్యని ఎడల వేరు వ్యవస్థ సరిగా అభివృద్ధి చెందదని తెలిపారు. సరియైన తేమ శాతం ఉన్నప్పుడు రైతులు డీఏపీ 25 కిలోలు, యూరియా 25 కిలోలు, పొటాష్ 15 కిలోలు ఒక ఎకరాకు వేసుకోవాలని సూచించారు. అక్కడక్కడ కాండం తొలుచు వీవిల్ పురుగు నష్టం కనిపిస్తుందని, నివారణకు కార్బో ఫిరాన్ గుళికలు వేసుకోవాలని వీలైనంత త్వరగా మొదటి దఫా ఎరువులు వేసుకోవాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలలో యూరియా డిఏపి మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి ఏ ఏ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

# బాబాయి అబ్బాయిలతోనే సిక్కోలు అభివృద్ధి సాధ్యం

### మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్



సంతబొమ్మాళి, జూన్ 22, మేజర్‌న్యూస్ : వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు నేడు కొలువుతీరిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని సంతబొమ్మాళి మండలం మాజీ పిఏసిఎస్ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్ అన్నారు. ఈ మేరకు మర్రిపాడు తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా ఖ్యాతిని దేశ స్థాయిలో తీసుకువెళ్లి జిల్లా అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన దివంగత కింజరాపు ఎర్రనాయుడు వారసుడు ప్రస్తుతం కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడం అలాగే జిల్లాపై పూర్తి పట్టు ఉన్న రాష్ట్ర మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు బాధ్యతలు చేపట్టడం ఈ జిల్లా ప్రజలు చేసుకున్న అదృష్టమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసారని అందులో వ్యవసాయ, వంశధార తదితర రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం ఎప్పుడు సంతోషంగా ఉంటుందో అప్పుడు అభివృద్ధి ఫలాలు అందుతాయని తెలిపారు. ఇందులో భాగంగానే చెరువులు, వ్యవసాయ కాలువలు వంశధార కాలువలను అభివృద్ధి చేసే దిశగా అచ్చెన్నాయుడు వ్యూహరచన చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గత ఐదు సంవత్సరాల కాలంలో చెరువులు మరమ్మత్తులు గాని కాలువలు మరమ్మత్తులు గాని చేయలేదని తెలిపారు. అందుకే ప్రస్తుత వర్షాభావ పరిస్థితిలో పశువులు తాగేందుకు కూడా నీరులేని పరిస్థితి ఉందని తెలిపారు. ఈ జిల్లాలో ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉన్న అచ్చెన్నాయుడు ఇటీవల కాలంలో అధికారులతో సమీక్ష చేస్తూ రైతాంగానికి ఎటువంటి ఇబ్బంది తలెత్తే పరిస్థితి రానివ్వొద్దని అధికారులను సూచించడం ఇందుకు నిదర్శనమని తెలిపారు.

గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇష్ట రాజ్యాంగ విత్తనాలు ఎరువులు పంపిణీ జరిగేదని అన్నారు. ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా లబ్ధి చేకూరేలా వ్యూహరచన చేస్తున్నారని చెప్పారు. ప్రతీకార దాడులు ఉండవని ఎన్నికల వరకే రాజకీయాలని ఆ తరువాత సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలుగుదేశమని భరోసా ఇచ్చారు.

# డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ఆధ్వర్యంలో ఫెర్టి కమ్ సీడ్ డ్రిల

సారవకోట/జలుమూరు, జూన్ 22, మేజర్‌న్యూస్: శనివారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సారవకోట మండలం మరియు జలుమూరు మండలంలో లింగాలవలస గ్రామంలో ఎరువులు మరియు విత్తనం ఒకేసారి వేసే (ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్) యంత్రంతో జరుగుతున్న క్షేత్ర ప్రదర్శనలను సందర్శించిన మండల వ్యవసాయ అధికారి కె .సురేష్ మాట్లాడుతూ "మారిన వాతావరణ పరిస్థితులలో వర్షాధారంగా లభిస్తున్నతక్కువ నీటితో లాభదాయక దిగుబడులు సాధించాలంటే వరి సాగును యంత్రాలతో చేయవలసిన ఆవశ్యకత ఏర్పడిందని" రైతులకు సూచించారు.ఎకరాకు కేవలం 16 కిలోల శుద్ధిచేసిన విత్తనాన్ని నేరుగా చదును చేసిన పొలంలో ట్రాక్టర్ తో నడిచే ఎరువులు మరియు విత్తనం ఒకేసారి వేసే (ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్) తో వేసుకోవచ్చున్నారు. విత్తనాన్ని ఎక్కువ లోతులో వేసినట్లయితే మొలకశాతం దెబ్బతినే అవకాశం ఉందని, కనుక నేల పై పొరల్లో పడేటట్లుగా అంటే సుమారు 2.5 నుండి 5 సెం.మీ లోతులో విత్తనం పడేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ పద్ధతిలో మొక్కల వరుసల మధ్య దూరం 22 మరియు మొక్కకు మొక్కకు మధ్య 10 %ఎ% దూరం ఏర్పడుతుంది. దీని వలన గాలి వెలుతురు బాగా తగలడం వలన చీడ పీడల ఉధృతి తక్కువ ఉండటమే కాకుండా పిలకలు ఎక్కువగా ఏర్పడి దిగుబడి పెరుగుతుందని తెలియజేయడం జగరిగింది. రైతులు విత్తనాలు వేసేముందు సూడోమోనస్ - 10 గ్రాములు /కేజీ చొప్పున విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల అగ్గి మరియు కుళ్ళు తెగుళ్లను అరికట్టవచ్చు అని తెలియజేయడం జరిగింది.



ఈ కార్యక్రమంలో వి.ఎ.ఎ రాజశేఖర్, సురేష్, డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ సమన్వయకర్త కె .ధర్మారావు ఆయా గ్రామాల రైతులు బుక్క కామేశ్వరరావు, జి .మధు పాల్గొన్నారు.

# సంతబొమ్మాళి నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి అభినందనలు తెలిపిన అట్టాడ



సంతబొమ్మాళి, జూన్ 22, మేజర్‌న్యూస్: మండలంలో నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ధూపాన గౌరీ శంకర్ మరియు కార్యవర్గానికి సంతబొమ్మాళి మండలం మాజీ పిఏసిఎస్ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్ అభినందనలు తెలియజేశారు ఈ మేరకు శనివారం నాడు తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతన అధ్యక్షుని కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ నాయకుల్ని తప్పుల్ని ఎత్తిచూపుతో ఉన్నత నాయకులుగా తీర్చిదిద్దేది మీడియా అంటూ తెలిపారు. మీడియాలో వచ్చిన ప్రతికూల వార్తలను విశ్లేషించుకొని చక్కదిద్దుకుంటేనే రాజకీయ నాయకుల మనుగడ సాధ్యమవుతుందంటూ తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు ఏవి నిజం ఏది అబద్ధమో తెలుసుకోలేని పరిస్థితి నేడు ఉందని అయినప్పటికీ పత్రికల్లో వచ్చే వార్తలు మాత్రం విశ్వసనీయతకు అర్థం పడుతుందని అందుకే నేటికీ మీడియాకు ఆదరణ తగ్గలేదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కోట రాము రెడ్డి తో పాటు మండల విలేకరులు పాల్గొన్నారు.

# కళా కృషితో తోటపల్లిలైనింగ్ పనులు మొదలు



వంగర, జూన్ 22, మేజర్‌న్యూస్: తెలుగు దేశం సీనియర్ నాయకులు,శాసన సభ్యులు కళా కృషితో తోటపల్లి పనులకు మోక్షం కలుగు తుంది.నాడు ఉనుకూరు, రాజాం నియోజక వర్గం శాసనసభ్యునిగా,మంత్రిగా పనిచేసిన,ప్రస్తుత చీపురు పల్లి శాసన సభ్యునిగా శుక్రవారం నాడు శాసన సభలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మాట్లాడిన కిమిడి కళావెంకట రావు తోటపల్లి పనులు పూర్తి చేయించటానికి హామీ ఇచ్చారు.ఈ హామీమేరకు తోటపల్లి కుడి, ఎడమ కాల్వల లైనింగ్ తదితర అభివృద్ధిపనులకు కంకణం కట్టుకున్నారని ఆయకట్టు రైతులు సంబరాలు చేసుకొంటున్నారు. గత అరేడేళ్ళుగా తోట పల్లి పనులు నత్త నడక గా జరుగుతున్నయన్న విమర్శలు అనేకం. ప్రస్థుతం అధికారం చేపట్టటం, 2018-19 నాడు టీడీపీ ప్రభుత్వహయాంలో నాటిమంత్రి,నేడు ఎంఎల్ ఎ కిమిడికళావెంకటరావు కృషితో ఈ పనులకు నాడు రూ.193 కోట్లరూపాయలు మంజూరు చేయించటం,వెంటనే పనులు మొద లైన సంగతి తెలిసిందే.తోటపల్లి కుడి, ఎడమ కాల్వల లైనింగ్ పనులు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మొదలుపెట్టిన విషయం తెలిసిందే. మరలా టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టటం,కిమిడి శాసన సభ్యునిగా అసెంబ్లీ సమావేశ మందిరంలో శాసన సభ్యుని గా ప్రమాణ స్వీకారోత్స వంలో తోటపల్లి పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపిన నేపథ్యంలో, ఈ ఖరీఫ్ అనంతరం తోటపల్లి కుడి, "ఎడమ కాల్వల లైనింగ్ తది తర పనులుమొదలు కానున్నాయనితెలిసింది. సీఎంగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టినందున మొత్తం తోటపల్లి ఆయకట్టు రైతుల్లోఆశలు మొదలయ్యాయి.గత జూలై లో అప్పటివరకూ చేసిన కాల్వల లైనింగ్ పనులు బిల్లులు చెల్లించని కారణంగా పనుల ను కాంట్రాక్టర్ అర్థాంతరంగా నిలిపి వేసిన సంగతి విధితమే. అప్పట్లో తోటపల్లి కుడి, ఎడమ కాల్వల లైనింగ్ పనులు కొంతవరకూ పూర్తయన్న విషయం

తెలిసిందే.అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతను అప్పటివరకూ చేసినటువంటి కుడి,ఎడమ ప్రధాన కాల్వల లైనింగ్ పనులకు కొన్నేళ్ళు వరకూ బిల్లులుచెల్లించని కారణంగా పనులు నిలిచిపోయాయి. అధికార వైసీపీ పాలకొండ,రాజాం అధికార వైసీపీ శాసన సభ్యులు ఈ సమస్యను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లటంతో అప్పటివరకూ అయినటువంటి పనులకు బిల్లు చెల్లింపులు చేపట్టటంతో,మరలాకాంట్రాక్టర్ లైనింగ్ తదితర పనులు మొదలు పెట్టారు.గతజులై నుంచి సంవత్సరకాలంగా బిల్లులు చెల్లించని కారణంగా ఏడాది కాలంగా కాంట్రాక్టర్ పనులను నిలిపివే సినన సంగతి తెలిసిందే.ప్రస్తుతం కళా వెంకట రావు,టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టటం, కళా వెంకటరావు ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించడంతో తోటపల్లి ఆయకట్టు రైతుల్లో ఆశలు మొదలయ్యాయి.

## వాసవీ క్లబ్ ఉదయాస్తమాన సేవలు



విజయనగరం టౌన్, జూన్ 22, మేజర్‌న్యూస్: సంవత్సరంలో ఒకరోజు సూర్యోదయం నుండి సూర్యుడు అస్తమించే వరకు పూర్తిగా సమాజ సేవలు చేయాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అదనపు కోశాధికారి కాల్వ హరికృష్ణ పిలుపునిచ్చారు. అందులో భాగంగా శనివారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో జరిగిన సమావేశంలో కాల్వ హరికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజసేవ కోసం ఉద్భవించిన క్లబ్ వాసవీ క్లబ్ అని చెప్పారు. ప్రతి సభ్యుడు సేవే పరమావధిగా పనిచేస్తూ, నిరంతరం సమాజ సేవ చేయుటకు సిద్ధంగా ఉండాలని, అందుకు తగిన ప్రణాళికలు ఇంటర్నేషనల్ క్లబ్ నుండి వస్తాయని అన్నారు. వాసవీ క్లబ్-విజయనగరం మరియు వనిత విజయం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ మురళీకృష్ణ పర్యవేక్షణలో పేద వర్తకులకు గొడుగులు, అంధ విద్యార్థులకు స్టిక్స్, వీధి వ్యాపారులకు తోపుడు బళ్లు, హాయగ్రీవ పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, చాక్లెట్లు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చెన్నా బుచ్చి జనార్ధనరావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయ్ కుమార్, సహ కోశాధికారి విన్నకోట రమేష్, గుంపిన ఇందిర, వాసవీ వనిత విజయం అధ్యక్షురాలు పి.ప్రభావతి,కందుల సంతోష్, రీజియన్ సెక్రెటరీ సముద్రాల నాగరాజు,ఏ.వి.ఎస్.కుమార్, గూడూరు నరసింగరావు, గుంపిన నారాయణ రావు,ఏడుకొండలు, మండవిల్లి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు పెంపకం పై దృష్టి సారించాలి



రామభద్రపురం, జూన్ 22, మేజర్‌న్యూస్: ఉపాధి హామీ పథకం కింద ఈ సీజన్లో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలని ఏపీవో గొలగాని త్రినాధరావు తెలిపారు మండల పరిధిలోని తారాపురం గ్రామంలో జరుగుతున్న కాలువ పనులను శనివారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏ రకాల మొక్కలు అవసరమో ఇండెంటు ఇవ్వాలని సూచించా మనీ తెలిపారు ఎస్సీ ఎస్టీ వికలాంగులకు పనులు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు 80 రోజులు పై బడిన 98 రోజులు లోపన్న వేతనదారులకు వంద రోజులు పని కల్పించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు అనంతరం కాలువ పనులు మస్తాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్యకళ




రామభద్రపురం, జూన్ 22, మేజర్‌న్యూస్: గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవహాలపై విస్కృతమైన అవగాహన కల్పించాలని ఐ సి డి సూపర్వైజర్ డి సూర్యకళ తెలిపారు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో శనివారం కిషోర్ బాలికలకు పలు సూచనలు సలహాలు అందించారు ముఖ్యంగా చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల కలిగే ఇబ్బందులు ఈ వయసులో ఎటువంటి ఆకర్షణకు కావద్దని బాలికలకు తెలిపారు 18 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఎటువంటి సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు అలాగే ర్యాగింగ్ సెల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే సమస్యలను వివరించారు విద్యార్థులంతా ముఖ్యంగా చదువు పైనే తమ దృష్టి ఉంచాలని ఇతర చేడు అలవాట్లకు గురకాకుండా మంచి భవిష్యత్తుకు పునాదులు వేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే కామేశ్వరరావు పిఈటి శ్రీదేవి అంగన్వాడి కార్యకర్తలు జి లక్ష్మి రాధా మణి తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు ఎస్ ఐ గోపాల రావు



లక్కవరపుకోట, జూన్ 22, మేజర్‌న్యూస్: మాదక ద్రవ్యాలకు బానిస అయితే జీవితం నాసనము అవుతుందని అందుకే గంజాయి హెరాయిన్ కొకైన్ మద్యం వంటి మాదక ద్రవ్యాలకు ఎవరూ బానిస కావొద్దని ఎస్ ఐ గోపాలరావు విజ్ఞప్తి చేసారు శనివారం ఎల్ కోట మండల కేంద్రం లో ప్రపంచ మాదక ద్రవ్య నిరోదక దినోత్సవము సందర్భంగా గ్రామం లో ర్యాలీ నిర్వహించారు .ప్రపంచం లో డ్రగ్స్ వాడే వారి సంఖ్య పెరిగి పోవడం ముఖ్యముగా యువత డ్రగ్స్ కి బానిస కావడం వలన వారి జీవితాలు నాశనం అయిపోతున్నాయని అనేక డ్రగ్స్ కి అలవాటు పడిన వారు వారి యొక్క ఇంగిత జ్ఞానం కోల్పోయి ఆసాంగిక శక్తుల చేతుల్లో కీలు బొమ్మలు గా మారిపోయి అనేక అరాచకాలు చేస్తున్నారని .మత్తులో మునిగి తేలుతూ వారు ఏమి చేస్తున్నారో తెలియని స్థితిలో చదువుకు దూరం అవుతూ సమాజానికి వారి కుటుంబానికి భారంగా తయారవుతున్నారన్నారు .అందుకే మత్తుకు గురి చేసే డ్రగ్స్ జోలికి ఎవ్వరు పోవద్దని సూచించారు ఈ ర్యాలీలో ఏ ఎస్ ఐ శ్రీనివాస్ ఎల్ కోట హై స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.